PRGI Reg No -"APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక




ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 144, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, బుధవారం - 15 - జూలై - 2026 , వెల రూ.5/-

# చంద్రబాబు సర్కార్‌కు మానవత్వం ఉందా?: వైఎస్ జగన్

★ బోటు ప్రమాదం జరిగిన వెంటనే చంద్రబాబు సర్కార్ ఎందుకు స్పందించలేదు

★ విశాఖలోని జబ్బర్‌తోటలో మత్స్యకార కుటుంబాలను ఆయన పరామర్శించారు

★ వైఎస్ జగన్‌కు తమ కష్టాన్ని మత్స్యకారులు చెప్పుకున్నారు..

★ ఫిషరీస్ అధికారులు కూడా స్పందించలేదని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు

★ బాధితులకు రూ.కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

★ మన ప్రభుత్వం వచ్చాక నెలలోపే ఆదుకుంటాం

★ వైఎస్సార్‌సీపీ హయాంలో మత్స్యకారుల కోసం 10 ఫిషింగ్ హార్బర్‌లకు శ్రీకారం చుట్టాం




విశాఖపట్నం: బోటు ప్రమాదం జరిగిన వెంటనే చంద్రబాబు సర్కార్ ఎందుకు స్పందించలేదని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. విశాఖలోని జబ్బర్‌తోటలో మత్స్యకార కుటుంబాలను ఆయన మంగళవారం పరామర్శించారు. బోటు ప్రమాదంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్ జగన్‌కు తమ కష్టాన్ని మత్స్యకారులు చెప్పుకున్నారు.. అనంతరం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. "ఈ నెల 1న ఏడుగురు మత్స్యకారులు వేటకు వెళ్లారు. కేవలం పది మైళ్ల దూరంలోనే ఘటన జరిగింది. జులైన 4న చిన్నా ఫోన్‌చేసి ఇంటికొస్తున్నామని చెప్పాడు. దురదృష్టవశాత్తు ఫోన్ చేసిన కాసేపటికే బోటు ప్రమాదం జరిగింది. ఫిషరీస్ అధికారులు కూడా స్పందించలేదని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బోటు ప్రమాదం జరిగిందని అధికారులకు మెసేజ్ చేశారు. రాత్రి 10:30కి కలెక్టర్, మెరైన్ సీఐకి మెసేజ్ పెట్టారు. వెంటనే స్పందిస్తే గంటల్లోనే మత్స్యకారులు దొరికేవారు. వెంటనే కోస్ట్‌గార్డ్ వచ్చి ఉంటే ఐదుగురైనా బతికేవారు.

## ప్రశాంత్ కిశోర్ సంపద ఎంత తెలుసా? భార్య ఆయనకంటే ధనవంతురాలు!

ప్రశాంత్ కిశోర్ ఆస్తుల విలువ రూ.96 కోట్లు




ఢిల్లీ,: బీహార్‌లోని బంకిపూర్ ఉప ఎన్నికలో పోటీ చేస్తున్న జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ తన ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించారు. ఆయన మొత్తం ఆస్తుల విలువ రూ.96 కోట్లకు పైగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇందులో రూ.22.19 కోట్ల విలువైన చరాస్తులు, రూ.73.87 కోట్ల స్థిరాస్తులు ఉన్నాయని తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి కళ్లు కనపడట్లేదా?: బండి సంజయ్




★ ఒవైసీ కాలేజీ చెరువులో ల్లదని నమ్మించే ప్రయత్నాన్ని ప్రభుత్వం చేస్తోందన్న బండి సంజయ్

★ ఓటు బ్యాంకు రాజకీయాలకు అనుగుణంగా ఎఫ్‌టీఎల్ పరిధిని మారుస్తోందని విమర్శ

★ నచ్చని వారిని టార్గెట్ చేసుకుని దాడులు చేయడం సరికాదని హితవు

## ఆ పాటతో ఒకరు సీఎం అయ్యారు.. అందుకే నాకు కోపం: కవిత ఆసక్తికర వ్యాఖ్యలు

● 'వెంకట్రామయ్య గారి తాలూకా' ప్రీ రిలీజ్ వేడుకలో పాల్గొన్న కవిత

● చిన్న సినిమాలకు, నిర్మాతలకు అండగా ఉంటామని కల్వకుంట్ల కవిత హామీ

● భవిష్యత్తులో అధికారంలోకి వస్తే కొత్త సినీ పాలసీ తెస్తామని ప్రకటన

● 'మూడు రంగుల జెండా' పాటతో ఒకరు సీఎం అయ్యారంటూ ఆసక్తికర వ్యాఖ్య

● రాష్ట్రాలు విడిపోయినా తెలుగు ప్రజలమంతా ఒక్కటేనని పిలుపు




హైదరాబాద్, : చిన్న సినిమా నిర్మాతలకు తమ పార్టీ అండగా నిలుస్తుందని, భవిష్యత్తులో తమకు రాష్ట్రాన్ని నడిపించే అవకాశం లభిస్తే వారికి మేలు చేసేలా కొత్త సినీ విధానాన్ని తీసుకొస్తామని కల్వకుంట్ల కవిత అన్నారు. అదే సమయంలో ఇటీవలి ఎన్నికల్లో ఓ వ్యక్తిని ముఖ్యమంత్రిని చేసినంతగా ప్రజాదరణ పొందిన పాటకు సంగీతం సమకూర్చిన




## ఊరూరా తిరిగి బీఆర్ఎస్ కుట్రలను ప్రజలకు తెలియజేస్తాం: పొన్నం ప్రభాకర్ కాళేశ్వరం కుంగిపోవడానికి

## రాయలసీమ ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా? వైసీపీకి సోమిరెడ్డి సవాల్




అమరావతి,: రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల విషయంలో వైసీపీ ఇప్పుడు కొత్త డ్రామాకు తెరలేపిందని, ఐదేళ్ల పాలనలో వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసి ఇప్పుడు సమీక్షల పేరుతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తోందని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాయలసీమ ప్రాజెక్టులపై తాము చేసిన ఖర్చు, వైసీపీ హయాంలో జరిగిన నిర్లక్ష్యంపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని, దమ్ముంటే రావాలని ఆయన సవాల్ విసిరారు. ఈరోజు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సోమిరెడ్డి మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వంపై, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై తీవ్ర విమర్శలు చేశారు.

రాయలసీమ లిఫ్ట్‌పై ఇప్పుడు డ్రామాలు

2020లోనే నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఎన్జీటీ) రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (ఆర్ఎల్ఐఎస్) పనులపై స్టే ఇచ్చిందని సోమిరెడ్డి గుర్తుచేశారు. "అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్ అల్లుడు, మంత్రి హరీశ్ రావు తామే 18 లేఖలు రాసి, కేసులు వేసి ఆర్ఎల్ఐఎస్ పనులను ఆపించామని ఆనాడు 'నమస్తే తెలంగాణ' పత్రికలో గొప్పగా చెప్పుకున్నారు. మరి, కేసీఆర్‌తో స్నేహంగా ఉన్న జగన్.. ఆ స్టేను నాలుగేళ్ల పాటు ఎందుకు ఎత్తివేయించలేకపోయారు? ఇప్పుడు అధికారం కోల్పోయాక 'గొడ్డలి పార్టీ' నాయకులు సమీక్షలు, రౌండ్ టేబుల్ సమావేశాల పేరుతో కొత్త నాటకాలు ఆడుతున్నారు. ఈ సమీక్షలు మీ తాడేపల్లి ప్యాలెస్‌లో పెట్టుకుని, ఐదేళ్లలో మీరేం చేశారో ఆత్మపరిశీలన చేసుకోండి" అని సోమిరెడ్డి ఎద్దేవా చేశారు.

ఖర్చులో పోలికే లేదు

టీడీపీ ప్రభుత్వానికి, వైసీపీ ప్రభుత్వానికి ప్రాజెక్టులపై ఉన్న చిత్తశుద్ధికి ఖర్చు చేసిన నిధులే నిదర్శనమని సోమిరెడ్డి పేర్కొన్నారు. "మేం అధికారంలోకి వచ్చిన వెంటనే 24 నెలల్లోనే ప్రాజెక్టులపై రూ. 12,484 కోట్లు ఖర్చు చేశాం. మరో రూ. 10 వేల కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. కానీ మీరు 2019 నుంచి 2024 వరకు

## ' మోదీ జీ.. నా తనయుడి కేసును కాగితంగానే మిగిలిపోనివ్వకండి'




పూణే: మహారాష్ట్రలోని పూణేలో రియల్టర్ కేతన్ అగర్వాల్ హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తాజాగా బాధితుడి తల్లి రాఖీ అగర్వాల్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఓ భావోద్వేగ లేఖ రాశారు. తన కుమారుడి హత్యకు కారణమైన వారికి కఠిన శిక్ష పడేలా చూసి, తమ కుటుంబానికి న్యాయం చేయాలని ఆమె ప్రధానిని వేడుకున్నారు.

## సింగరేణికి పట్టిన శని ఆ రెండు పార్టీలే.. దోచుకుతిన్నారు




కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు సింగరేణిని దోచుకుతిన్నాయన్న కిషన్ రెడ్డి

సింగరేణిని అప్పుల ఊబిలోకి నెట్టేశారని ఆరోపణ

సింగరేణిని కాపాడుకోవడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి

# అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదు: రేవంత్ రెడ్డి

➢ వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌లను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని వినతి

➢ 2028 జూన్ 2 నాటికి వరంగల్ విమానాశ్రయం సిద్ధం చేయాలని కోరిన ముఖ్యమంత్రి


➢ కాకతీయ సంస్కృతి ఉట్టిపడేలా వరంగల్ ఎయిర్‌పోర్ట్ డిజైన్ ఉండాలని సూచన

➢ వేగంగా భూసేకరణ పూర్తి చేయడంపై తెలంగాణ ప్రభుత్వాన్ని అభినందించిన కేంద్రం



హైదరాబాద్, : అభివృద్ధిని రాజకీయాలతో ముడిపెట్టకూడదని, రాజకీయాలు కేవలం ఎన్నికల సమయానికే పరిమితం కావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఏర్పాటుచేయనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు వరంగల్ కేంద్రంగా ఉంటుందని, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌తో పాటు ఇతర పరిశ్రమల రాకతో నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నందున విమానాశ్రయం ఎంతో కీలకమని ముఖ్యమంత్రి... కేంద్రమంత్రికి వివరించారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయినందున వెంటనే టెండర్లు పిలిచి,

## పనికిరాని నిబంధనలు రద్దు చేయండి!: ఆర్టీజీఎస్ సమీక్షలో చంద్రబాబు దిశానిర్దేశం




అమరావతి,:ప్రభుత్వ పాలనలో వేగం పెంచేందుకు, అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని నివారించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఫైళ్ల క్లియరెన్స్ పేరుతో అభివృద్ధి ఆలస్యం కాకూడదని స్పష్టం చేసిన ఆయన, అవసరం లేని, పాతబడిపోయిన 'బిజినెస్ రూల్స్'ను సంస్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం తక్షణమే ఒక కమిటీని ఏర్పాటు చేసి, నిబంధనలను సరళతరం చేయాలని నిర్దేశించారు.

## ఏపీ పాలనలో వినూత్న ప్రయోగం.. నెలవారీ నివేదికలతో పర్యవేక్షణ




ఆంధ్రప్రదేశ్ పాలనలో వినూత్న మార్పులకు శ్రీకారం చుడుతున్నామని, డేటా ఆధారిత పాలన (డేటా డ్రివెన్ గవర్నెన్స్) దిశగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. దేశంలోనే తొలిసారిగా నెలవారీ ఆర్థిక నివేదికల (మంత్లీ ఎకనామిక్ రిపోర్ట్స్) ఆధారంగా ప్రభుత్వ పాలనను ముందుకు తీసుకెళ్లనున్నట్లు ఆయన ప్రకటించారు. అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌వోడీలతో జరిగిన సమావేశంలో ఆయన ఈ కీలక విషయాలను వెల్లడించారు. ఈ సరికొత్త విధానం ద్వారా కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ (కేపీఐ)

## అవమానించారు.. క్షమాపణ చెప్పాల్సిందే రాహుల్ గాంధీకి మెల్‌బోర్న్ నిర్వాహకుల ఘాటు లేఖ

'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' సభపై కాంగ్రెస్ ఆరోపణలను ఖండించిన నిర్వాహకులు

సభకు వచ్చినవారు కిరాయి జనం కాదని, స్వచ్ఛందంగా పాల్గొన్నారని స్పష్టీకరణ

'పెయిడ్ క్రౌడ్' వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని రాహుల్, ఖర్గేలకు డిమాండ్

ప్రధానిపై విమర్శలు చేయొచ్చు కానీ,

ప్రవాస భారతీయులను అవమానించడం సరికాదన్న నిర్వాహకులు

రాజకీయాల్లోకి ప్రవాస భారతీయులను లాగొద్దని బహిరంగ లేఖలో విజ్ఞప్తి




ఢిల్లీ,: ఆస్ట్రేలియాలో జరిగిన 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమానికి హాజరైన వేలాది మంది ప్రవాస భారతీయులను 'కిరాయి జనం' (పెయిడ్ క్రౌడ్) అని కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగింది. ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తూ కార్యక్రమ నిర్వాహకులు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలకు ఒక బహిరంగ లేఖ రాశారు. ఆరోపణలను వెంటనే వెనక్కి తీసుకుని, ఆస్ట్రేలియాలోని భారత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. జులై 9న మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగం కోసం 30,000 మందికి పైగా ప్రవాస భారతీయులు తరలివచ్చారు. ఆస్ట్రేలియాలో ఒక విదేశీ నేతకు లభించిన అతిపెద్ద స్వాగతాల్లో ఇది ఒకటిగా నిలిచింది. అయితే, ఈ కార్యక్రమానికి హాజరైన వారిని బీజేపీ లేదా భారత ప్రభుత్వం డబ్బులిచ్చి సమీకరించిందని కాంగ్రెస్ నేతలు సోషల్ మీడియాలో ఆరోపణలు చేశారు.

## రాయలసీమలో రూ.3,100 కోట్ల పెట్టుబడి.. 700 మందికి ఉద్యోగాలు.. నేడే లోకేశ్ శంకుస్థాపన




కడప జిల్లాలో దాల్మియా సిమెంట్ పరిశ్రమ విస్తరణకు రంగం సిద్ధం

రూ.3,100 కోట్ల భారీ పెట్టుబడితో రెండో ప్లాంట్ నిర్మాణం

కొత్తగా 700 మందికి ఉద్యోగాలు, ప్రభుత్వానికి ఏటా రూ.325 కోట్ల ఆదాయం

అమరావతి,: ప్రజా ప్రభుత్వ పాలనలో రాయలసీమ పారిశ్రామిక ప్రగతి పథంలో దూసుకుపోతోంది. ముఖ్యంగా కడప జిల్లాలో పెట్టుబడుల వెల్లువ కనిపిస్తోంది. ఇప్పటికే సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజీ వంటి కీలక ప్రాజెక్టులు జిల్లాలో కొలువుదీరుతుండగా, తాజాగా మరో భారీ పరిశ్రమ విస్తరణకు అంకురార్పణ జరగనుంది. జిల్లాలోని జమ్మలమడుగు నియోజకవర్గం,

## ప్రశాంత్ కిశోర్ సంపద ఎంత తెలుసా? భార్య ఆయనకంటే ధనవంతురాలు!

మొదటి పేజీ తరువాయి

ఇందులో రూ.22.19 కోట్ల విలువైన చరాస్తులు, రూ.73.87 కోట్ల స్థిరాస్తులు ఉన్నాయని తెలిపారు. ఆయన భార్య జాహ్నవి దాస్ పేరిట రూ.89.51 కోట్ల చరాస్తులు, రూ.12.42 కోట్ల స్థిరాస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో వెల్లడైంది. నామినేషన్ దాఖలు చేసే ముందు సోన్‌పూర్‌లోని బాబా హరిహర్‌నాథ్ ఆలయంలో ప్రశాంత్ కిశోర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. ఇది కేవలం తన నామినేషన్ మాత్రమే కాదని, నేరచరిత్ర ఉన్న నేతలు అధికారానికి దూరం కావాలనే రాజకీయ మార్పు కోసం చేస్తున్న పోరాటమని వ్యాఖ్యానించారు. అఫిడవిట్‌లో తనపై నమోదైన కేసుల వివరాలను కూడా ప్రశాంత్ కిశోర్ వెల్లడించారు. పరువునష్టం, ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించడం, మోసం వంటి ఆరోపణలతో మొత్తం ఎనిమిది కేసులు నమోదైనట్లు తెలిపారు. అయితే వీటిలో ఏ కేసులోనూ ఇప్పటివరకు అభియోగాలు నమోదు కాలేదని పేర్కొన్నారు. అలాగే తనపై రూ.5.77 కోట్ల బ్యాంకు రుణం కూడా ఉన్నట్లు వెల్లడించారు. ప్రశాంత్ కిశోర్‌కు ఘజియాబాద్‌లో రెండు ఫ్లాట్లు, మరో రెండు ఫ్లాట్లలో 50 శాతం వాటా ఉంది. పట్నాలోని పాటలీపుత్ర కాలనీ, ఢిల్లీలోని వసంత్ విహార్, బక్సర్, స్వగ్రామంలో కూడా ఆస్తులు ఉన్నాయి. ఆయన భార్యకు గువాహటిలో రెండు ఫ్లాట్లు, ఒక బంగ్లాలో మూడో వంతు వాటాతో పాటు నోయిడాలో మరో ఆస్తి ఉంది. వేద వెంచర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ప్రశాంత్ కిశోర్ యజమానిగా ఉండగా, ఆ సంస్థ 2024-25లో జన్ సూరాజ్‌కు రూ.85 కోట్ల విరాళం ఇచ్చినట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

## 'మోదీ జీ.. నా తనయుడి కేసును కాగితంగానే మిగిలిపోనివ్వకండి'

మొదటి పేజీ తరువాయి

తన కుమారుడి హత్యకు కారణమైన వారికి కఠిన శిక్ష పడేలా చూసి, తమ కుటుంబానికి న్యాయం చేయాలని ఆమె ప్రధానిని వేడుకున్నారు. గత జూన్ 18న కేతన్‌తో వివాహం జరగాల్సిన సియా గోయల్ తన ప్రియుడు చేతన్ చౌదరితో కలిసి కేతన్‌ను హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించి, వారిని అరెస్ట్ చేశారు. కేతన్ మృతిచెందిన 20 రోజులకే, ఆ బాధను తట్టుకోలేక అతని తాత కన్నుమూశారు. దీనిపై భారతి అగర్వాల్ ఆవేదన వ్యక్తం చేస్తూ, కొద్దిరోజుల వ్యవధిలోనే తమ కుటుంబం రెండు తరాలను కోల్పోయిందని ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రతిరోజూ తమ ఇల్లు కేతన్ జ్ఞాపకాలతో ?ప్రతిధ్వనిస్తోందని ఆమె కన్నీరుమున్నీరయ్యారు. తాము ఎటువంటి ప్రత్యేక సదుపాయాలు ఆశించడం లేదని, కేవలం సత్వర న్యాయం మాత్రమే కావాలని ఆమె ఆ లేఖలో కోరారు. కాగా ఇప్పటికే కేతన్ తండ్రి విశాల్ అగర్వాల్ కూడా ఈ కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. దోషులకు చట్ట ప్రకారం కఠినమైన శిక్ష పడేలా ప్రధాని వ్యక్తిగతంగా చొరవ చూపాలని బాధితుని తల్లి విజ్ఞప్తి చేశారు. కేతన్ హత్య కేసును కేవలం కాగితంగానే మిగిలిపోనివ్వకండి' అని లేఖలో విన్నవించారు.

## సింగరేణికి పట్టిన శని ఆ రెండు పార్టీలే.. దోచుకుతిన్నారు

హైదరాబాద్, : తెలంగాణకు గుండెచప్పుడు లాంటి సింగరేణి సంస్థను గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు కలిసి నిలువునా ముంచేశాయని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు. కేసీఆర్ కుటుంబం, కాంగ్రెస్ పాలకులు పోటీపడి మరీ సింగరేణిని తమ సొంత ఖజానాలా వాడుకున్నారని మండిపడ్డారు. కార్మికుల చెమట వాసన తెలిసిన సంస్థను అప్పుల ఊబిలోకి నెట్టి, ఇప్పుడు దాని భవిష్యత్తును పూర్తిగా అంధకారంలోకి నెట్టేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. సింగరేణి నుంచి బొగ్గు కొనుగోలు చేసి, విద్యుత్ వాడుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ సంస్థకు చెల్లించాల్సిన బకాయిలను తుంగలో తొక్కిందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం సుమారు రూ. 30 వేల కోట్ల బకాయిలు పెట్టిపోతే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దానికి మరో రూ. 24 వేల కోట్లు జోడించిందని మండిపడ్డారు. ఇలా మొత్తం రూ. 54 వేల కోట్ల కార్మికుల కష్టార్జితాన్ని అప్పులపాలు చేసి, సంస్థను ఆర్థిక సంక్షోభంలోకి తోశారని ఆరోపించారు. కేసీఆర్ తన హయాంలో సింగరేణి బోర్డును ఉత్సవ విగ్రహంగా మార్చి, టెండర్ల పేరుతో భారీ దోపిడీకి పాల్పడ్డారని విమర్శించారు. రాజకీయాలు చేయడానికి తాను ఇక్కడికి రాలేదని, సింగరేణిని కాపాడుకోవడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. గత పాలకులు సంస్థ ఆదాయాన్ని ఫుట్‌బాల్ మ్యాచ్‌లు వంటి అనవసరమైన వాటికి మళ్లించారని దుయ్యబట్టారు. ప్రధాని మోదీ హయాంలో సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయించి కార్మికులకు అసలైన భరోసా కల్పించామన్నారు. సింగరేణి మనుగడ కోసం ఎన్ని అడ్డంకులు ఎదురైనా కేంద్రం అండగా నిలబడుతుందని, కార్మికుల ప్రయోజనాలను కాపాడి తీరుతామని ఆయన హామీ ఇచ్చారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి కళ్లు కనపడట్లేదా?: బండి సంజయ్



హైదరాబాద్, : ప్రపంచమంతా చూస్తున్నా.. ఒవైసీ కళాశాల చెరువులో లేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా నమ్మించే ప్రయత్నం చేస్తోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ ధ్వజమెత్తారు. నిరుపేదల ఇళ్లను కూల్చడానికి ఉన్న ఉత్సాహం, అందరికీ కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్న ఈ భారీ ఆక్రమణలపై ఎందుకు చూపించడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డి సర్కార్‌కు నిజంగానే కంటిచూపు సమస్య ఉందా? లేక ఎంఐఎంతో ఉన్న రాజకీయ బంధం వల్ల ఆ సంకల్పం లోపించిందా? అంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకుల కంటి జబ్బును నయం చేసేందుకు బీజేపీ కార్యకర్తలంతా కలిసి ఉచిత నేత్ర పరీక్ష శిబిరాలు నిర్వహించాలని బండి సంజయ్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కళ్లు పరీక్షించాక కూడా అక్కడ చెరువు ఆక్రమణ కనిపించకపోతే, అది కంటి లోపం కాదని, కచ్చితంగా రాజకీయ లోపమేనని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ అవసరాలకు, ఓటు బ్యాంకు రాజకీయాలకు అనుగుణంగా ఎఫ్‌టీఎల్ పరిధి గీతలను ఇష్టమొచ్చినట్లు మారుస్తోందనే అనుమానాలు ఇప్పుడు ప్రజల్లో బలంగా వ్యక్తమవుతున్నాయన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని కాగితాల మీద చెప్పే ప్రభుత్వం... ఆచరణలో మాత్రం పేదలకు ఒక న్యాయం, అధికార పక్షానికి దగ్గరగా ఉండే ఎంఐఎం లీడర్లకు మరో న్యాయం చేస్తోందని దుయ్యబట్టారు. నచ్చిన వారిని వదిలేసి, నచ్చని వారిపై ఎంపిక చేసుకుని మరీ దాడులు చేయడం సరికాదని హితవు పలికారు. చెరువుల సంరక్షణ విషయంలో ప్రభుత్వం ఈ ద్వంద్వ వైఖరిని పక్కనబెట్టాలని డిమాండ్ చేశారు.

## ఆ పాటతో ఒకరు సీఎం అయ్యారు.. అందుకే నాకు కోపం: కవిత ఆసక్తికర వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి



అదే సమయంలో ఇటీవలి ఎన్నికల్లో ఓ వ్యక్తిని ముఖ్యమంత్రిని చేసినంతగా ప్రజాదరణ పొందిన పాటకు సంగీతం సమకూర్చిన చరణ్ అర్జున్‌పై తనకు కాస్త కోపం ఉందని సరదాగా ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయ, సినీ వర్గాల్లో ఆసక్తి రేకెత్తించాయి. దినేశ్ కుమార్, దివిజ ప్రభాకర్ జంటగా నటించిన 'వెంకట్రామయ్య గారి తాలూకా' చిత్ర ప్రీ రిలీజ్ వేడుకకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు చరణ్ అర్జున్‌ను కవిత ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆయన అద్భుతమైన సంగీతాన్ని అందిస్తారని కొనియాడుతూ.. "చరణ్ అర్జున్ స్వరపరిచిన 'మూడు రంగుల జెండా' పాట ఒక వ్యక్తిని ముఖ్యమంత్రిని చేసింది. అంతటి శక్తిమంతమైన పాటను అందించినందుకు ఆయనపై నాకు కాస్త అలక, కోపం వున్నాయి" అని సరదాగా వ్యాఖ్యానించారు. ఈ సినిమా పాటలు కూడా అదే స్థాయిలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. సినిమా టైటిల్ 'వెంకట్రామయ్య గారి తాలూకా' ప్రస్తావన రాగా, 'తాలూకా' అనే పదం తెలంగాణలో అంతగా వాడుకలో లేదని కవిత అన్నారు. ఈ పేరు విన్నప్పుడు కాస్త భిన్నంగా అనిపించినా, భౌగోళికంగా రాష్ట్రాలు విడిపోయినా తెలుగు ప్రజలంతా ఒక్కటేనని, మనమంతా కలిసి ఉండాలన్నదే తమ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. ఇరు ప్రాంతాల సంస్కృతులను పరస్పరం గౌరవించుకున్నప్పుడే భాష, సంస్కృతి నిలబడతాయని, తెలుగు చిత్రసీమ మనందరినీ కలిపే ఒక గొప్ప మాధ్యమంగా ఉండాలని పిలుపునిచ్చారు. చిత్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లపై కవిత తన ప్రసంగంలో ప్రధానంగా దృష్టి సారించారు. "తమిళ, కన్నడ పరిశ్రమల మాదిరిగా మన దగ్గర చిన్న నిర్మాతలకు, థియేటర్లకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు లేవు. ఎంతో ప్రతిభ ఉన్నా సరైన అవకాశాలు దక్కడం లేదు. ఓటీటీల రాకతో మేలు జరుగుతుందని ఆశించినా, అవి కూడా పూర్తిగా వ్యాపార ధోరణిలోనే నడుస్తున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తులు అమ్మి, సర్వస్వం పణంగా పెట్టి సినిమాలు తీసే చిన్న నిర్మాతలు బాగుంటేనే చిత్ర పరిశ్రమ మనుగడ సాగిస్తుందని ఆమె స్పష్టం చేశారు. "చిన్న నిర్మాతలకు తెలంగాణ రక్షణ సేన అండగా ఉంటుంది. భవిష్యత్తులో మాకు అధికారం వస్తే, తప్పకుండా చిన్న చిత్రాలకు ప్రయోజనం చేకూరేలా సరికొత్త సినీ విధానాన్ని రూపొందిస్తాం" అని కవిత హామీ ఇచ్చారు. కుటుంబ బంధాల నేపథ్యంలో తెరకెక్కిన 'వెంకట్రామయ్య గారి తాలూకా' చిత్రంలో దినేశ్ కుమార్ హీరోగా, ప్రముఖ నటుడు ఈటీవీ ప్రభాకర్ కుమార్తె దివిజ ప్రభాకర్ హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. సతీశ్ ఆవాల దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 17న విడుదల కానుంది.

## రాయలసీమలో రూ.3,100 కోట్ల పెట్టుబడి.. 700 మందికి ఉద్యోగాలు.. నేడే లోకేశ్ శంకుస్థాపన

మొదటి పేజీ తరువాయి



జిల్లాలోని జమ్మలమడుగు నియోజకవర్గం, మైలవరం మండలం చిన్నకొమెర్ల వద్ద ఉన్న దాల్మియా భారత్ సిమెంట్ పరిశ్రమ రెండో ప్లాంట్ విస్తరణ పనులకు రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ జులై 15 శంకుస్థాపన చేయనున్నారు. రూ.3,100 కోట్ల భారీ పెట్టుబడితో ఈ విస్తరణ పనులు చేపట్టనున్నారు. రెండు నెలల వ్యవధిలోనే మంత్రి లోకేశ్ ఇదే నియోజకవర్గంలో రెండోసారి పారిశ్రామిక కార్యక్రమానికి హాజరు కావడం గమనార్హం. ఈ ఏడాది మే 22న కొండాపురం మండలంలో 'సెయిల్' సౌర విద్యుత్ ప్రాజెక్టును ఆయన ప్రారంభించారు. ఇప్పుడు దాల్మియా సిమెంట్ విస్తరణతో ఈ ప్రాంత పారిశ్రామిక ముఖచిత్రం మరింత మారనుంది.

ఉత్పత్తి సామర్థ్యం, ఉద్యోగాల్లో భారీ పెరుగుదల

దాల్మియా సిమెంట్ సంస్థ రూ.3,100 కోట్ల పెట్టుబడితో చేపట్టనున్న ఈ విస్తరణ ద్వారా ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. ప్రస్తుతం మైలవరం ప్లాంటులో ఏటా 2.5 మిలియన్ టన్నుల క్లింకర్, 3.6 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తి అవుతోంది. కొత్త ప్లాంట్ విస్తరణ పూర్తయ్యాక క్లింకర్ ఉత్పత్తి సామర్థ్యం 6.1 మిలియన్ టన్నులకు, సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం 9.6 మిలియన్ టన్నులకు చేరనుంది. ఈ విస్తరణ కేవలం ఉత్పత్తికే పరిమితం కాకుండా, స్థానికంగా ఉపాధి అవకాశాలను కూడా భారీగా పెంచనుంది. ఇప్పటికే ఉన్న ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 950 మంది ఉపాధి పొందుతుండగా, ఈ విస్తరణతో కొత్తగా మరో 700 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. దీంతో మొత్తం ఉపాధి పొందుతున్న వారి సంఖ్య 1,650కి చేరుకుంటుంది. ఈ ప్రాజెక్టు వల్ల రవాణా, లాజిస్టిక్స్ వంటి అనుబంధ పరిశ్రమల్లోనూ అదనపు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.

ప్రభుత్వ ఖజానాకు పెరగనున్న ఆదాయం

ఈ భారీ పరిశ్రమ విస్తరణతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు కూడా ఆదాయం గణనీయంగా పెరగనుంది. ప్రస్తుతం దాల్మియా సంస్థ పన్నులు, మైనింగ్ రాయల్టీల రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా రూ.102 కోట్లు చెల్లిస్తోంది. ప్రతిపాదిత విస్తరణ పూర్తయితే ఈ ఆదాయం ఏకంగా రూ.325 కోట్లకు పెరుగుతుందని అంచనా.

పర్యావరణ హితమే లక్ష్యంగా 'గ్రీన్ ఇండస్ట్రీ'

దాల్మియా సంస్థ రెండో దశ విస్తరణ పనులను కేవలం వాణిజ్యపరంగానే కాకుండా, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా అత్యుత్తమ ప్రమాణాలతో 'గ్రీన్ ఇండస్ట్రీ'గా తీర్చిదిద్దనుంది. పరిశ్రమకు అవసరమైన విద్యుత్‌లో 80 శాతాన్ని సౌర, పవన విద్యుత్ వంటి పునరుత్పాదక వనరుల నుంచే సమకూర్చుకోనుంది. మొత్తం ప్రాజెక్ట్ విస్తీర్ణంలో 33 శాతం పచ్చదనం ఉండేలా గ్రీన్ బెల్ట్ అభివృద్ధి చేయనున్నారు. పరిశ్రమలో వాడిన నీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించేందుకు 'జీరో లిక్విడ్ డిశ్చార్జ్' వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు సుమారు రూ.100 కోట్ల పెట్టుబడితో 130 అధిక సామర్థ్య బ్యాగ్ ఫిల్టర్లను ఏర్పాటు చేయనుండటం విశేషం.

దేశంలో నాలుగో అతిపెద్ద సిమెంట్ సంస్థ

ఎనిమిది దశాబ్దాలకు పైగా సిమెంట్, చక్కెర, విద్యుత్ రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న దాల్మియా భారత్ గ్రూప్, దేశంలో నాలుగో అతిపెద్ద సిమెంట్ తయారీ సంస్థగా గుర్తింపు పొందింది. రూ.14,800 కోట్ల వార్షిక టర్నోవర్‌తో, దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో 19 సిమెంట్ కర్మాగారాలు, గ్రైండింగ్ యూనిట్లను నిర్వహిస్తోంది. సుమారు 33,000 మందికి పైగా డీలర్ల నెట్‌వర్క్‌తో వినియోగదారులకు సేవలందిస్తోంది. ఈ సంస్థ భారీ విస్తరణ చేపట్టడం రాయలసీమ పారిశ్రామిక ప్రగతికి శుభసూచకమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## అవమానించారు.. క్షమాపణ చెప్పాల్సిందే రాహుల్ గాంధీకి మెల్‌బోర్న్ నిర్వాహకుల ఘాటు లేఖ

మొదటి పేజీ తరువాయి

అయితే, ఈ కార్యక్రమానికి హాజరైన వారిని బీజేపీ లేదా భారత ప్రభుత్వం డబ్బులిచ్చి సమీకరించిందని కాంగ్రెస్ నేతలు సోషల్ మీడియాలో ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, ప్రవాస భారతీయులను తీవ్రంగా అవమానించేలా ఉన్నాయని నిర్వాహకులు తమ లేఖలో పేర్కొన్నారు. "ఈ కార్యక్రమం ఆస్ట్రేలియాలోని భారత సమాజం స్వచ్ఛందంగా, ఎంతో ఉత్సాహంగా చేసుకున్న వేడుక. దీనికి ఎలాంటి రాజకీయ పార్టీ లేదా ప్రభుత్వం నిధులు సమకూర్చలేదు. సిడ్నీ వంటి ఇతర నగరాల నుంచి వచ్చిన వారి కోసం 'మోదీ ఎయిర్‌వేస్' పేరుతో ఏర్పాటు చేసిన విమాన ప్రయాణాలు కూడా వాలంటీర్ల ఆధ్వర్యంలో, ప్రయాణికులు సొంత ఖర్చులతో చేసుకున్నవే" అని వారు స్పష్టం చేశారు. వృత్తి నిపుణులు, కుటుంబాలు, విద్యార్థులు, వృద్ధులు ఎంతో ఆసక్తితో, సొంత డబ్బు, సమయాన్ని వెచ్చించి ఈ చారిత్రక కార్యక్రమంలో పాలుపంచుకున్నారని నిర్వాహకులు వివరించారు. "ప్రధాని మోదీని విమర్శించే హక్కు కాంగ్రెస్ పార్టీకి ఉంది. కానీ, ఆ విమర్శల కోసం వేలాది మంది ప్రవాస భారతీయుల స్వాతంత్ర్యాన్ని, ఆత్మగౌరవాన్ని కించపరచడం సరికాదు. ప్రవాస భారతీయులు రాజకీయ పార్టీల చేతిలో కీలుబొమ్మలు కాదు. వారు తమ వారసత్వాన్ని జరుపుకోవడానికి, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన నాయకుడికి స్వాగతం పలకడానికి ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదు" అని లేఖలో పేర్కొన్నారు. తమ ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని అంగీకరించి, వాటిని వెనక్కి తీసుకుని, క్షమాపణ చెప్పాలని నిర్వాహకులు డిమాండ్ చేశారు. "దేశీయ రాజకీయాల్లో ప్రవాస భారతీయులను అనవసరంగా లాగవద్దు. మీ ఆరోపణలు వేలాది మంది వాలంటీర్ల శ్రమను, సొంత ఖర్చులతో వచ్చిన ప్రతి కుటుంబాన్ని, సెలవు పెట్టి మరీ వచ్చిన ప్రతి ఉద్యోగిని అవమానించేలా ఉన్నాయి. ఈ తప్పుడు ఆరోపణలను సరిదిద్దుకుని, మా సమాజానికి క్షమాపణ చెబుతారని ఆశిస్తున్నాం" అని వారు లేఖలో రాసుకొచ్చారు.

## ఊరూరా తిరిగి బీఆర్ఎస్ కుట్రలను ప్రజలకు తెలియజేస్తాం: పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, : కాళేశ్వరం ప్రాజెక్టు సంక్షోభం, రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి సమస్యలపై బీఆర్ఎస్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ మరోసారి విరుచుకుపడ్డారు. నిన్న బీఆర్ఎస్ శ్రేణులు రక్తం ప్యాకెట్లతో సీఎం రేవంత్ రెడ్డి నివాసాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రక్తం ప్యాకెట్లతో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందే కాళేశ్వరం కుంగిపోయిందని, దీనికి బీఆర్ఎస్ కారణమని ఆరోపించారు. ప్రతి గ్రామానికి వెళ్లి బీఆర్ఎస్ చేసిన కుట్రలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఎన్‌డీఎస్ఏ తుది నివేదిక ఇచ్చి కాళేశ్వరంలో నీటిని నింపమని చెబితే వెంటనే నింపుతామని చెప్పారు. ఇంజనీర్ల సలహాలను పాటిస్తామని తెలిపారు. ఎన్‌డీఎస్ఏ సూచనల మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. కరవును దృష్టిలో పెట్టుకొని ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాలనే మేడిగడ్డ, కన్నెపల్లి విషయంలో రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ఈ ఏడాది వర్షాలు తక్కువ పడతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారన్నారు. ఎల్‌నినోను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తరపున సూచనలు చేస్తున్నామని తెలిపారు. కరవును దృష్టిలో పెట్టుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలుగా అంతర్గత సమస్యలు ఉన్నా కలిసి ఎదుర్కోవాలని, బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ సలహాలు ఇవ్వాలని కోరారు.

## అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదు: రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

భూసేకరణ ప్రక్రియ పూర్తయినందున వెంటనే టెండర్లు పిలిచి, 2028 జూన్ 2 నాటికి పనులన్నీ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధీనంలోని ఎయిర్‌పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయాన్ని కూడా నిర్మించాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణా సంస్థలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు సీప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలని కోరగా, దీనిపై తగిన ప్రతిపాదనలు అందజేయాలని కేంద్రమంత్రి సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్రం చేయనంత వేగంగా తెలంగాణ ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించారు.

వరంగల్ కీలకం

ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండకు వరంగల్ కేంద్ర బిందువుగా ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. రైలు, రోడ్డు మార్గాలతో మెరుగైన అనుసంధానం ఉండటంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వంటి పరిశ్రమలతో ఈ నగరం మరింత కీలకంగా మారుతుందన్నారు. రానున్న రోజుల్లో వరంగల్‌ను పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయాలను కేవలం ఎన్నికలకే పరిమితం చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. వివిధ అంశాల్లో కేంద్ర ప్రభుత్వం తమకు సహకరిస్తోందని, ఏవైనా సమస్యలు ఉంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు. ఏదైనా సమాచార లోపం ఉంటే దానిని పరస్పరం మార్చుకోవడం ద్వారా అధిగమిస్తున్నామని ఆయన వివరించారు.

## చంద్రబాబు సర్కార్‌కు మానవత్వం ఉందా?: వైఎస్ జగన్

మొదటి పేజీ తరువాయి

వెంటనే కోస్ట్‌గార్డ్ వచ్చి ఉంటే ఐదుగురైనా బతికేవారు. ఈనెల 5న చైనా బోటు సిబ్బంది చిన్నాను కాపాడారు. తప్పుడు జరిగింది కాబట్టే త్రీమెన్ కమిటీ వేశారు. త్రీమెన్ కమిటీ నివేదిక అంతా తప్పుల తడక. చంద్రబాబు ప్రభుత్వానికి మానవత్వం ఉందా?" అంటూ వైఎస్ జగన్ ప్రశ్నించారు. ఘటన జరిగిన వెంటనే ఒక్క అధికారి రాలేదు. ఉత్తరాంధ్ర మంత్రులు ఒక్కరు కూడా రాలేదు. బాధితులను ఫిషరీష్ మంత్రి కూడా పరామర్శించలేదు. బాధితుల వద్దకు మంత్రులను పంపాలని సీఎంకు తెలియదా?. రాత్రికి రాత్రే స్పందిస్తే మత్స్యకారులు బతికేవారు. ఎక్స్ గ్రేషియా కింద అరకొర సాయం చేశారు. బాధితులకు రూ.కోటి చొప్పన ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. ఏడుగురు మత్స్యకారులకు కుటుంబాలకు పరిహారం అందాలి.

5 లక్షలు ముష్టి వేస్తున్నావా.. ప్రతి కుటుంబానికి కోటి రూపాయలు, కొత్త ఇల్లు

మన ప్రభుత్వం వచ్చాక నెలలోపే ఆదుకుంటాం. గతంలో మా ప్రభుత్వంలో మత్స్యకారులకు భరోసా ఉండేది. 2018 పాదయాత్రలో మత్స్యకారులకు ఇచ్చిన మాట నెరవేర్చాం. పాక్‌లో చిక్కుకున్న మత్స్యకారులను సేఫ్‌గా తీసుకొచ్చాం" అని వైఎస్ జగన్ గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మత్స్యకారుల కోసం 10 ఫిషింగ్ హార్బర్‌లకు శ్రీకారం చుట్టాం. మరో 6 ఫిష్ ల్యాండ్‌పనులు కూడా చేపట్టాం. ఈ రోజు ఫిషింగ్ హార్బర్‌లను స్కామ్‌లతో అమ్మేస్తున్నారు. ఏపీలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరు. ప్రభుత్వ స్కూల్ పిల్లలకు బుక్స్, యూనిఫాంలు లేవు. రాష్ట్రంలో రైతు రోడ్డెక్కే పరిస్థితి ఉంది. ప్రజలతో బాబు చెలగాటమాడుతున్నారు" అంటూ వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రాయలసీమ ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా? -వైసీపీకి సోమిరెడ్డి సవాల్

మొదటి పేజీ తరువాయి

కానీ మీరు 2019 నుంచి 2024 వరకు ఎంత ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయగలరా? వైసీపీ నేత, ఉరవకొండ ఇన్‌ఛార్జ్ విశ్వేశ్వర్ రెడ్డే స్వయంగా తమ ప్రభుత్వ హయాంలో సీమకు ఏమీ చేయలేకపోయామని అంగీకరించారు. దీన్నిబట్టి చూస్తే రాయలసీమకు ద్రోహం చేసింది ఎవరో స్పష్టమవుతోంది" అని విమర్శించారు.

చరిత్ర టీడీపీది.. విధ్వంసం వైసీపీది

తెలుగు గంగ, హంద్రీనీవా, గాలేరు-నగరి వంటి ప్రాజెక్టులకు రూపకల్పన చేసి, వాటిని అత్యధికంగా పూర్తి చేసింది స్వర్గీయ ఎన్టీఆర్, చంద్రబాబు అని సోమిరెడ్డి గుర్తుచేశారు. "జగన్ రెడ్డి జీఓ 365 పేరుతో రాయలసీమలోని 102 సాగునీటి ప్రాజెక్టుల పనులను రద్దు చేశారు. అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోతే 39 మంది ప్రాణాలు కోల్పోయారు. కృష్ణా జలాల్లో మిగులు జలాలు కోరబోమని బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్‌కు లేఖ రాసి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీమకు తీరని అన్యాయం చేశారు. జలయజ్ఞం పేరుతో మీరు చేసింది ధనయజ్ఞం మాత్రమే" అని ఆరోపించారు.

మైక్రో ఇరిగేషన్‌ను చంపేశారు

రాయలసీమ వంటి కరవు ప్రాంతానికి అత్యంత కీలకమైన మైక్రో ఇరిగేషన్ (బిందు, తుంపర సేద్యం) పథకాన్ని జగన్ రెడ్డి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని సోమిరెడ్డి మండిపడ్డారు. "చంద్రబాబు హయాంలో 5 ఎకరాల సబ్సిడీని 10 ఎకరాలకు పెంచి, డ్రిప్ ఇరిగేషన్‌లో రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా నిలిపాం. కానీ జగన్ రాగానే ఆ పథకాన్ని రద్దు చేశారు. దీంతో రాయలసీమ రైతులు తీవ్రంగా నష్టపోయారు. పులివెందుల రెడ్లే తన వద్దకు వచ్చి ఈ విషయం అడుగుతున్నారని అప్పటి వ్యవసాయ మంత్రి కన్నబాబు జగన్‌తో చెప్పినా, 'నీ పని నువ్వు చూసుకో' అని విసుక్కున్నారంటే సీమ రైతులపై ఆయనకు ఎంత ప్రేమ ఉందో అర్థమవుతోంది" అని సోమిరెడ్డి అన్నారు.

కూటమి ప్రభుత్వం కార్యాచరణ

ప్రస్తుత కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టిందని సోమిరెడ్డి తెలిపారు. "నిర్వీర్యమైన పోలవరం ప్రాజెక్టును మళ్లీ గాడిలో పెట్టాం. కృష్ణా డెల్టాకు నీళ్లు లేకపోతే పట్టిసీమ ద్వారా 7 వేల క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నాం. రూ. 35,313 కోట్లతో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చంద్రబాబు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. సాగునీటి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నిజాయతీగా, కష్టపడి పనిచేస్తున్నారు. ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూసే వైసీపీ నేతలకు రాయలసీమ పేరు ఎత్తే అర్హత కూడా లేదు" అని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్పష్టం చేశారు.

దీనివల్ల రాష్ట్రంలోని వివిధ రంగాల్లో నమోదయ్యే వృద్ధి రేటును, ప్రగతిని ఎప్పటికప్పుడు రియల్ టైమ్‌లో గమనించేందుకు వీలుంటుందని చెప్పారు. ఈ విధానం వల్ల ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే గుర్తించి, మనల్ని మనం సరిదిద్దుకుని ముందుకు సాగేందుకు ఆస్కారం కలుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## ఏపీ పాలనలో వినూత్న ప్రయోగం.. నెలవారీ నివేదికలతో పర్యవేక్షణ

మొదటి పేజీ తరువాయి

ఈ సరికొత్త విధానం ద్వారా కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ (కేపీఐ) బేస్డ్ గవర్నెన్స్ ఫ్రేమ్‌వర్క్‌ను అమలు చేస్తామని పయ్యావుల వివరించారు. దీనివల్ల రాష్ట్రంలోని వివిధ రంగాల్లో నమోదయ్యే వృద్ధి రేటును, ప్రగతిని ఎప్పటికప్పుడు రియల్ టైమ్‌లో గమనించేందుకు వీలుంటుందని చెప్పారు. ఈ విధానం వల్ల ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే గుర్తించి, మనల్ని మనం సరిదిద్దుకుని ముందుకు సాగేందుకు ఆస్కారం కలుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న 'స్వర్ణాంధ్ర-2047' విజన్‌ను సాకారం చేసుకునేందుకు ఈ నెలవారీ ఆర్థిక నివేదికలు ఎంతగానో ఉపకరిస్తాయని మంత్రి పయ్యావుల కేశవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు ఈ ప్రయత్నం దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.

## పనికిరాని నిబంధనలు రద్దు చేయండి!: ఆర్టీజీఎస్ సమీక్షలో చంద్రబాబు దిశానిర్దేశం

మొదటి పేజీ తరువాయి



ఇందుకోసం తక్షణమే ఒక కమిటీని ఏర్పాటు చేసి, నిబంధనలను సరళతరం చేయాలని నిర్దేశించారు. మంగళవారం సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్) కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రోయాక్టివ్ గవర్నెన్స్ అందించడంపై అధికార యంత్రాంగం దృష్టి సారించాలన్నారు. ఉన్నతాధికారులు సరైన నాయకత్వంతో పనిచేస్తేనే ప్రభుత్వ ఫలాలు చిట్టచివరి వ్యక్తి వరకు చేరతాయని స్పష్టం చేశారు. టెక్నాలజీని అనుసంధానం చేస్తూ పాలనలో పారదర్శకత తీసుకురావాలని సూచించారు. 2017తో పోలిస్తే రాష్ట్ర స్థూల ఉత్పత్తి (+ణూణూ) 20 శాతం వృద్ధి సాధించిందని, ఈ అవకాశాలను అందిపుచ్చుకునేలా నిబంధనల్లో వెసులుబాటు కల్పించాలన్నారు.

దేవాలయాలను గ్రోత్ సెంటర్లుగా మార్చాలి

దేవాదాయ శాఖపై సమీక్షలో భాగంగా రాష్ట్రంలోని 21 ప్రముఖ దేవాలయాలను గ్రోత్ సెంటర్లుగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. ఈ ఆలయాల పరిసరాల్లో ఆర్థిక, పర్యాటక కార్యకలాపాలు పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రసాదాల నాణ్యతతో పాటు ఆధ్యాత్మిక వాతావరణాన్ని మెరుగుపరచాలని ఆదేశించారు. అదేవిధంగా, ఆర్టీసీ బస్సులు సరైన సమయానికి నడిచేలా చూడాలని, బస్టాండ్లలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. అగ్నిమాపక శాఖ సేవల ప్రమాణాలను పెంచాలని, రాష్ట్రంలో యూరియా కొరత రాకుండా రైతులకు భరోసా ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు.

ఫిర్యాదుల పరిష్కారానికి క్రౌడ్ సోర్సింగ్

ప్రభుత్వానికి వచ్చే అన్ని ఫిర్యాదుల స్వీకరణకు 'క్రౌడ్ సోర్సింగ్' విధానాన్ని అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ప్రతి అర్జీని మానవీయ కోణంలో పరిశీలించి, వేగంగా పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాజకీయ కక్షతో కొందరి భూములను 22ఏ జాబితాలో చేర్చారని, ఇలాంటి వివాదాలను పరిష్కరించడం ద్వారా ఎన్నో అవకాశాలను సృష్టించవచ్చని తెలిపారు. శెట్టిపల్లి భూ వివాదం పరిష్కారంతో ప్రభుత్వానికి రూ.900 కోట్ల విలువైన భూమి రావడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సమీక్షలో మంత్రి కొల్లు రవీంద్ర వర్చువల్‌గా పాల్గొనగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమీక్ష అనంతరం, ఆర్టీజీఎస్ రూపొందించిన 'గవర్నెన్స్ డట్ నెవర్ స్లీప్స్' మాసపత్రికను సీఎం ఆవిష్కరించారు.

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక


# కూటమి ప్రభుత్వంలో ఆరోగ్య సేవలకు పెద్దపీట

**-పెనమలూరు ప్రజలకు మరో వరం..-రూ.50 లక్షలతో అత్యాధునిక బ్లడ్ టెస్ట్ ల్యాబ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్**



పెనమలూరు, జులై 14 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) ప్రజారోగ్యమే ప్రభుత్వానికి నిజమైన సంపద అనే సంకల్పంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వైద్య రంగాన్ని బలోపేతం చేస్తుండగా,పెనమలూరు నియోజకవర్గంలో మరో కీలక అడుగు పడిందని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు.కృష్ణా జిల్లాలో అత్యధిక జనాభా కలిగిన పెనమలూరు మండలంలోని పెనమలూరు గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన అత్యాధునిక బ్లడ్ టెస్ట్ ల్యాబ్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ ల్యాబ్‌లోని ఆధునిక వైద్య పరికరాలను పరిశీలించి,స్వయంగా రక్త పరీక్షలు చేయించుకుని సేవల నాణ్యతను తెలుసుకున్నారు,అనారోగ్యంతో వచ్చే ప్రతి ఒక్కరికీ వేగవంతంగా,బాధ్యతాయుతంగా వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్‌లో అత్యాధునిక యంత్రాల ద్వారా 64 రకాల రక్త పరీక్షలు నిర్వహించే సౌకర్యం కల్పించామని తెలిపారు,ప్రజలు నమూనాలు ఇచ్చిన రెండు గంటల్లోనే పరీక్షల నివేదికలు అందేలా వ్యవస్థను సిద్ధం చేశామని,దీనివల్ల ప్రజలకు వేగవంతమైన,నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని,అనారోగ్య నివారణతో పాటు అత్యుత్తమ వైద్య సేవలను ప్రతి పౌరుడికి అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవలతో పాటు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఇప్పటికే పెనమలూరు నియోజకవర్గ ప్రజలకు సుమారు రూ.21 కోట్ల ఆర్థిక సహాయం అందించామని,ప్రతి రోజూ సుమారు రూ.10 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీలు మంజూరు చేయిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు.పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రస్తుతం సుమారు 120 మంది సిబ్బంది, 8 మంది వైద్యులు,ఏఎన్ఎంలు,స్టాఫ్ నర్సులు, ఆశా కార్యకర్తలు ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తున్నారని చెప్పారు,గతంతో పోలిస్తే అవుట్‌పేషెంట్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని, ప్రభుత్వ ఆసుపత్రిలోనే సాధారణ ప్రసవాలు విజయవంతంగా నిర్వహిస్తున్నారని వెల్లడించారు.ప్రైవేట్ ఆసుపత్రుల్లో లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని,ప్రజలందరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పిలుపునిచ్చారు.ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తూనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పెనమలూరు మండల పార్టీ అధ్యక్షులు కోయ ఆనంద ప్రసాద్. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మార్పుడి దన కోటేశ్వరరావు, రాష్ట్ర గౌడ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్, బీసీ సెల్ అధ్యక్షులు సంగేపు రంగారావు, బొగ్గవరపు శ్రీనివాసరావు, షేక్ సలాం, ఏ కుల విజయేంద్ర, మేక స్వాతి,ముసునూరు శ్రీనివాసరావు, చిగురుపాటి శ్రీనివాస్, గూడవల్లి పూర్ణ, మోర్ల నరేంద్ర, ఎస్కే శ్రీను, పాముల బలరాం, కలపాల శ్రీధర్,మాబు సుభాని,అబ్దుల్ గౌస్, ఎమ్మార్వో రాజు, అన్నపూర్ణ డాక్టర్ బాలాజీ శ్రీనివాస్, డాక్టర్ సాయి లత. డాక్టర్ బిజిలి శ్రీనివాస్, సీనియర్ నాయకులు కూటమి నాయకులు, కార్యకర్తలు,వైద్యులు,వైద్య సిబ్బంది,ఆశా కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్



పెనమలూరు, జులై 14 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఆదేశాల మేరకు ఇరువురు లబ్ధిదారులకు రూ.2 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంర్ఫ్ ) ఎల్ ఓ సి పత్రాలు తెలుగుదేశం పార్టీ నాయకులు అందజేశారు.ప్రజల కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తూ,అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామప్రసాద్, కోయ ఆనంద ప్రసాద్, వనమాల ఆంజనేయులు, మొత్రపు విశ్వ,ఎలమంచిలి కనకదుర్గ పాల్గొన్నారు.

# వైసీపీ పాలనలో కార్యకర్తలకు భరోసా లేదు


**- కూటమి హయాంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద భీమా-పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలను ఎన్నికల సమయంలో మాత్రమే గుర్తు చేసుకునే సంస్కృతి వైసీపీదైతే, -కష్టకాలంలో కార్యకర్త కుటుంబాలకు అండగా నిలిచే సంస్కృతి తెలుగుదేశం పార్టీదని మరోసారి రుజువైంది**



పెనమలూరు, జులై 14 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) పెనమలూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ క్రియాశీల సభ్యుడు స్వర్గీయ నెనావతులా రాంబాబు అకాల మరణంతో,తెలుగుదేశం పార్టీ కార్యకర్తల ప్రమాద భీమా పథకం కింద మంజూరైన రూ.5 లక్షల భీమా చెక్కును పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ సతీమణి నెనావతులా శివ పార్వతి కి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ,గత వైసీపీ పాలనలో పార్టీ కార్యకర్తల సంక్షేమం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని,కానీ నేడు నారా లోకేష్ నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలుస్తోందని అన్నారు, కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని,వారి కుటుంబాల సంక్షేమం పట్ల తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ బాధ్యతగా వ్యవహరిస్తుందని తెలిపారు.స్వర్గీయ నెనావతులా రాంబాబు సేవలను స్మరించుకుంటూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన ఎమ్మెల్యే, భవిష్యత్తులో కూడా పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పెనమలూరు మండల పార్టీ అధ్యక్షులు కోయ ఆనంద ప్రసాద్, రాష్ట్ర గౌడ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్,బూత్ కన్వీనర్ వనమాల ఆంజనేయులు .పార్టీ నాయకులు,కుటుంబ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో రాక్ బాల్ నేషనల్ గేమ్ కోసం స్థల పరిశీలన

**-త్వరలో ఆంధ్రప్రదేశ్ లో స్థల పరిశీలన**



హైదరాబాద్, జులై 14 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) తెలంగాణాలో సెప్టెంబర్ లో జరగబోయే రాక్ బాల్ నేషనల్ గేమ్ ని నిర్వహించడానికి స్థల పరిశీలన చేయడం జరిగిందని రాక్ బాల్ నేషనల్ గేమ్ కమిటీ తెలిపింది. తెలంగాణా రాష్ట్రంలోని నర్సాపూర్ బీవి ఆర్ ఐటీ కళాశాలలో నిర్వహించడానికి కమిటీ నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఇండియా ప్రెసిడెంట్ మురళి యాదవ్, వైస్ ప్రెసిడెంట్ రాదారి రామ్మోహన్ ముదిరాజ్, జనరల్ సెక్రెటరీ మన్యం సునీల్ కుమార్ ముదిరాజ్ , తెలంగాణ జనరల్ సెక్రెటరీ చిటుకుల లక్ష్మణ్ నేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెసిడెంట్ మోర్ల కామేశ్వరగౌడ్, కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి సౌత్ ఇండియా ప్రెసిడెంట్ మురళి యాదవ్ నర్సాపూర్ లో నేషనల్ గేమ్ ను అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. వచ్చే ఆటగాళ్లకు కోచ్ లకు విలాసవంతమైన సౌకర్యాలు కల్పిస్తామని, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తామని, ఆటను తిలకించటానికి వచ్చే క్రీడాభిమానులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో రాక్ బాల్ ఏషియన్ గేమ్స్ కూడా నర్సాపూర్ లో ఆతిథ్యం ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ లో కూడా రాక్ బాల్ నేషనల్ గేమ్ నిర్వహించేందుకు స్థల పరిశీలన చేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాక్ బాల్ నేషనల్ గేమ్ అధ్యక్షులు మోర్ల కామేశ్వరరావు గౌడ్ తెలిపారు.

# “పర్యాటక గుమ్మం” ఖమ్మం, కొత్త శోభతో ‘హరిత భవన్’

**- రూ.40 కోట్లతో నిర్మాణం మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవ - సచివాలయంలో మంత్రి సమీక్ష - మంత్రి జూపల్లికి లేఖ రాసిన తుమ్మల**

**- నిధులు వెంటనే మంజూరుకు విజ్ఞప్తి**



హైదరాబాద్, ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం జిల్లాను రాష్ట్ర పర్యాటక పటంలో మరింత ప్రముఖంగా నిలిపేందుకు తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో అడుగులు వేస్తోంది. “ఖమ్మం జిల్లా పర్యాటక గుమ్మంగా శరవేగంగా రూపుదిద్దుకుంటుంది. ఇక్కడి పర్యాటక, ఆతిథ్య మౌలిక సదుపాయాల కొరతను ప్రతిపాదిత హరిత భవన్ పూర్తిగా తీరుస్తుందని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళిశాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. లకారంపార్క్ సమీపంలో నిర్మించనున్న ‘హరిత భవన్’ ప్రాజెక్టుపై గురువారం సచివాలయంలో ఆయన అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది.



**- “హరిత హోటల్ కాదు.. హరిత భవన్”**

సమావేశంలో పర్యాటక శాఖ అధికారులు లకారంపార్క్ పరిసర ప్రాంతాల్లో సుమారు 5 ఎకరాల విశాలమైన స్థలంలో నిర్మించనున్న ఆధునిక హోటల్ ప్రణాళికను మంత్రి తుమ్మలకు సమగ్రంగా వివరించారు. ప్రతిపాదిత నిర్మాణానికి తొలుత ‘హరిత హోటల్’ అని పేరు పెట్టగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా “దీనిని ‘హరిత భవన్’గా మార్చండి” అని మంత్రి తుమ్మల సూచించారు.

**- “వెంటనే ప్రతిపాదనలు తీసుకురండి”**

ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సుమారు రూ.40 కోట్ల మేర వ్యయం అవుతుందని అధికారులు మంత్రికి వివరించగా “సంబంధిత ప్రతిపాదనలను వెంటనే సమర్పించండి. అవి అందిన వెంటనే పరిపాలనా అనుమతిని త్వరితగతిన మంజూరు చేస్తాం. ప్రజలకు ఉపయోగపడే ఈ ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకూడదు” అని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ సరీత, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ నరేష్, కన్సల్టెంట్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**- మంత్రి జూపల్లికి తుమ్మల లేఖ**

సత్వర నిధులు మంజూరు చేయాలని మంత్రి తుమ్మల జూపల్లిని కోరారు.జిల్లా అభివృద్ధి పట్ల తనకున్న చిత్తశుద్ధిని చాటుకుంటూ.. జూలై 14న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. హోన్‌బుల్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు లేఖ రాశారు. అందులో “తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ నియమించిన కన్సల్టెంట్ ఈ ప్రాజెక్టుకు తాత్కాలిక అంచనా వ్యయాన్ని రూ.40 కోట్లుగా సమర్పించారు. ఇప్పటికే జిల్లా యంత్రాంగం హరిత భవన్ ఏర్పాటు కోసం 5 ఎకరాల భూమిని గుర్తించి కేటాయించిందని పేర్కొన్నారు.

**- “ఖమ్మం జిల్లా ముఖచిత్రమే మారుతుంది”,**

జూపల్లికి విజ్ఞప్తి“జిల్లాకు వచ్చే పర్యాటకులు, భక్తులు, వాణిజ్య సందర్శకులు, అధికారులకు ఈ భవన్ నాణ్యమైన వసతి కల్పించడంతో పాటు సదస్సులు, సమావేశాలు తదితర కార్యక్రమాలకు అత్యుత్తమ వేదికగా ఉపయోగపడుతుంది” అని లేఖలో మంత్రి తుమ్మల వివరించారు. జిల్లా అభివృద్ధే ధ్యేయంగా “ఈ ప్రాజెక్టుకు ప్రాధాన్యతపై మంజూరు (శాంక్షన్) ఇవ్వాలని, టెండర్ల ప్రక్రియను చేపట్టి వీలైనంత త్వరగా నిర్మాణ పనులు ప్రారంభించాలని” మంత్రి జూపల్లి కృష్ణారావును ఆయన కోరారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఖమ్మం జిల్లా నిజమైన అర్థంలో రాష్ట్ర పర్యాటక గుమ్మంగా వెలుగొందుతుందని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# “ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను పరామర్శించిన బొలిశెట్టి”



తాడేపల్లిగూడెం జూలై 14 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ):::: తాడేపల్లిగూడెం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ముంబై కోకిలబెన్ ఆసుపత్రిలో కుడి భుజానికి శస్త్ర చికిత్స చేయించుకున్న జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆసుపత్రి నుండి తొందరగా కోలుకోవాలని ఆయన ఇంకా చురుకైన పాత్ర పోషించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో పర్యాటకశాఖా మంత్రి కందుల దుర్గేష్ తదితరులు ఉన్నారు.

# ప్రాణ త్యాగం చేసైనా...ప్రెస్ క్లబ్ ను కాపాడుకుంటాం

**నేటి నుండే ఆమరణ నిరాహార దీక్ష**



అనంతపురం బ్యూరో జూలై 14 నేటి శుభోదయ: వందలాది మంది జర్నలిస్టుల జీవితాలతో ముడిపడి ఉన్న అనంతపురము ప్రెస్ క్లబ్ ను ప్రాణత్యాగం చేసైనా కాపాడుకుంటామని పలువురు దీక్షలో కూర్చున్న జర్నలిస్టులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అనంతపురం ప్రెస్ క్లబ్ కు తక్షణం ఎన్నికలు నిర్వహించాలనే ప్రధాన డిమాండ్ తో ప్రెస్ క్లబ్ ఎదుట జర్నలిస్టులు చేపట్టిన రిలే దీక్ష మంగళవారం మూడో రోజు కు చేరుకుంది. ప్రజాస్వామ్య బద్ధంగా రాజకీయ పార్టీలకు, జర్నలిస్టు యూనియన్లకు అతీతంగా పలువురు సీనియర్ జర్నలిస్టులు స్వచ్ఛందంగా చేస్తున్న ఈ దీక్షలను చూసి ఎందరో ప్రజాస్వామ్యవాదులు స్వచ్ఛందంగా మద్దతు తెలిపారు. అయితే జిల్లా అధికార యంత్రాంగం నుండి గాని, ఎన్నికల కోసమే గత ఆరునెలల కిందట ఏర్పాటైన తాత్కాలిక హడ్ హక్ కమిటీ సభ్యుల నుండి గాని దీక్షపరులకు ఎలాంటి స్పష్టమైన హామీలేని కారణంగా ఆందోళన కార్యక్రమం మరింత ఉధృతం చేస్తున్నట్లు ప్రకటించారు. మూడవరోజు దీక్షలకు మద్దతు తెలిపిన వారిలో....లి మద్దతు తెలిపిన వారిలో..లి జై భీమ్ రామాంజనేయులు, సురేష్, ఎస్సీ జన సంఘం రాష్ట్ర నాయకుడు దాసగారి కుల్లాయప్ప, ఎస్సీ ఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు సాకే హరి, మాల మహానాడు అధ్యక్షుడు సుగమంచి శ్రీనివాసులు, సామాజిక కార్యకర్త డిస్కవర్ అనిల్ కుమార్ రెడ్డి, ఫైట్ ఫర్ రైట్స్ వ్యవస్థాపకులు కేపీ రాజు, శంకర్ రెడ్డి, బేడ బుడగ జంగం రాష్ట్ర కార్యదర్శి సిరిశాల అంజి, గిరిజన నాయకులు బాబు నాయక్, ఎస్సీ ఎస్టీ జేఏసీ నాయకులు పవన్ శ్రీధర్ రమణ, ఏఐఎస్ బి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డి పల్లి పృధ్వి, మద్దెల చెరువు మల్లీ, సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి, ఇన్సాఫ్ అధ్యక్షుడు జాఫర్, కూడేరు మాజీ ఎంపీపీ బ్రహ్మయ్య తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని మద్దతు తెలియజేశారు రేపటి నుంచే ఆమరణ నిరాహార దీక్ష అనంతపురం ప్రెస్ క్లబ్ అభివృద్ధికి ఏకైక కారణమైన ఎన్నికలు నిర్వహించాలనే ప్రధాన డిమాండ్ తో నేటి నుంచి(15-7-2026) ఆమరణ నిరాహార దీక్షలకు పోతున్నట్లు దీక్షలో కూర్చున్న పలువురు సీనియర్ జర్నలిస్టులు చెరుకూరి రామాంజనేయులు, రవి, రామ్మూర్తి, హరి, భాస్కర్ తదితరులు తమ స్పష్టమైన వైఖరి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు, కుల ప్రజా సంఘాల నాయకులు మద్దతుగా నిలిచారు.

# ప్రజాస్వామ్య పాఠాలు నేర్పిన త్రివేణి హౌస్ ఎలక్షన్స్-2026




ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో ఈరోజు హౌస్ ఎలక్షన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ ఈ ప్రక్రియ ఎన్నికల ప్రక్రియను పోలి ఉండడం మూలంగా విద్యార్థిని విద్యార్థులు ఎన్నికల ప్రక్రియ పట్ల అవగాహన పెంచుకుంటారని అన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులను నాలుగు రంగుల పేర్లతో అనగా ఛత్రపతి శివాజీ -బ్లూ హౌస్, రాజరాజ నరేంద్ర గ్రీన్ హౌస్, శ్రీకృష్ణదేవరాయ-రెడ్ హౌస్, గణపతి దేవ-ఎల్లో హౌస్ లాగా విభజిస్తారని, ఆయా హౌస్లలో ఉన్న విద్యార్థిని -విద్యార్థులు వారి హౌస్ లకు సంబంధించి లీడర్స్ ,కో - లీడర్స్, ట్రెజరర్ మొదలైన బాధ్యతలను నిర్వర్తించడానికి తమ తోటి విద్యార్థుల నుండి ఎంపిక చేసుకుంటారు. ఈ ఎంపిక ప్రక్రియ మాక్ పోలింగ్ లాగా నిర్వహిస్తామని ఇందులో ఆయా బాధ్యతలను స్వీకరించడానికి ముందుకు వచ్చిన విద్యార్థినీ-విద్యార్థుల చేత ముందుగా నామినేషన్ ప్రక్రియ,ఆ తర్వాత ఎన్నికల గుర్తు కేటాయింపు, ఆపైన ప్రచారం పూర్తయిన తర్వాత ఎన్నికల ప్రక్రియ జరుగుతుంది.ఈ ఎన్నిక రాజ్యాంగబద్ధంగా స్థానిక, మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికలు ఏ విధంగా జరుగుతుందో, అదే విధంగా జరిపి విద్యార్థుల్లో అవగాహన తీసుకొస్తామని అన్నారు. ఎన్నికైన విద్యార్థులు తమ తమ బాధ్యతల్లో సంవత్సరమంతా కొనసాగుతారని,మరుసటి సంవత్సరానికి మరల ఎన్నికలు నిర్వహిస్తామని అన్నారు. ఈ





కార్యక్రమంలో త్రివేణి పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న ,ముస్తఫా , క్యాంపస్ ఇంచార్జ విక్టర్ చార్లెస్, ట్రాన్స్పోర్ట్ ఇంచార్జ సందీప్ ఉపాధ్యాయినీ-ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తిచేయాలి

**: పోలీస్ కమిషనర్ సునీల్ దత్**



ఖమ్మం, నేటి శుభోదయ ::: పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తిచేసి అభియోగపత్రాన్ని నిర్ణీత గడువులోగా న్యాయస్థానంలో సమర్పించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ అధికారుల నేరసమీక్ష సమావేశం పోలీస్ కాన్ఫిరెన్స్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నేర విచారణలో నిందితులకు శిక్షల శాతం పెరగడం అత్యంత ముఖ్యమని, దీనికోసం పకడ్బందీ దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణ, పోలీసు-ప్రాసిక్యూషన్ సమన్వయం అవసరమన్నారు. కొత్త చట్టాల ప్రకారం నిర్ణీత గడువులోగా ట్రయల్ పూర్తి చేయాలని, సాక్షులు భయపడకుండా భరోసా కల్పిస్తూ న్యాయస్థానానికి హాజరయ్యేలా చూడాలన్నారు.ఎన్డీపీఎస్ కేసులో న్యాయస్థానంలో నేరాన్ని రుజువు చేయడానికి ఆయా కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయి , మాదకద్రవ్యాల స్వభావం, పరిమాణాన్ని శాస్త్రీయంగా నిర్ధారించే ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీ నివేదిక ప్రధాన ఆధారమని అన్నారు. అదేవిదంగా జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలను అరికట్టడానికి స్పెషల్ దృష్టి పెట్టాలని, ఈగల్ బృందాలు, టాస్క్ ఫోర్స్, స్థానిక పోలీసుల సమన్వయంతో మూలలను కనిపెట్టాలని అన్నారు.వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేస్తూ నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. చోరీల నివారణకు, దొంగిలించబడిన సొత్తును బాధితులకు తిరిగి అప్పగించడానికి పోలీసులు సాంకేతికతను ఉపయోగిస్తూ రికవరీపై ప్రత్యేక దృష్టి పెట్టాలాని, నిందితుల గుర్తింపు, రికవరీ వేగవంతం చెయాలన్నారు.విచారణలో భాగంగా ప్రతి కేసు ను సాంకేతిక ఆధారాలు, ఫోరెన్సిక్ సాక్ష్యాలు, డిజిటల్ సాక్ష్యాలను సమర్థవంతంగా వినియోగించి దర్యాప్తు చేపట్టాలని సూచించారు.శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేస్తూ నేరాలు జరిగిన తరువాత స్పందించడం కంటే..ముందస్తు నివారణ చర్యలు తీసుకోవడమే సమర్థవంతమైన పోలీసింగ్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.శాంతిభద్రతలు,నేరాల ధోరణి, పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ నేరాల నివారణ, మాదక ద్రవ్యాల నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్, పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే హాట్‌స్పాట్‌లు లేదా బ్లాక్ స్పాట్‌లలో ప్రాణనష్టాన్ని నివారించడానికి రోడ్డు భద్రతా చర్యలు, ఇంజనీరింగ్ మార్పులు, కఠినమైన ట్రాఫిక్ నియంత్రణలు చాలా ముఖ్యన్నారు. ప్రమాదకర మలుపులు, కూడళ్ల వద్ద స్పష్టమైన సైన్‌బోర్డులు, బ్లింకర్స్, స్పీడ్ బ్రేకర్లు, రంబిల్ స్ట్రిప్స్, గరిష్ఠ వేగపరిమితి సూచికలు పెట్టడం, రాత్రి సమయంలో స్పష్టత కోసం సోలార్ లైట్లు, వీధి దీపాలు మెరుగుపరచడం. గుంతలను పూడ్చడం, జారుడు రోడ్లకు తగిన గుర్తులు వేయడం వంటి చర్యలు సంబంధిత అధికారుల సమన్వయంతో ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏసీపీలు వసుందర యాదవ్, రమణమూర్తి, తిరుపతి రెడ్డి, సారంగపాణి, ఫణిందర్,నర్సింహారావు, సర్వర్, సత్యనారాయణ, సాంబరాజు పాల్గొన్నారు.



# మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

**- జులై 15వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ-బుధవారం ఉదయం 9:00 నుండి పిజిఆర్ఎస్ నిర్వహణ..**

**-రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో ‘మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100” అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలి**

**-జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి-జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**



అనంతపురం బ్యూరో జులై 14 నేటి శుభోదయ:మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి వీవవనెశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో “మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100” అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలన్నారు.జులై 15వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ :జులై 15వ తేదీన బుధవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9:00 నుండి నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. బుధవారం ఉదయం 9:00 నుండి పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ దేను నిర్వహించడం జరుగుతుందన్నారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సాప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం ఉదయం 9:00 నుండి పూర్తి అయ్యే వరకు డివిజన్, మండల మరియు ఎస్.జి.ఎస్.డబ్ల్యూ స్థాయిలలో పి.జి.ఆర్.ఎస్. గ్రీవెన్స్ దేను నిర్వహించాలని ఆర్.డి.ఓలు, తహసీల్దార్లు మరియు పి.డి.ఓలకు సూచించడమైనది.

# విద్యార్థుల భద్రతే లక్ష్యం -అగ్నిమాపక శాఖ విస్తృత అవగాహన

**-అగ్ని ప్రమాదాల నివారణ, మాక్‌డ్రిల్, ప్రథమ చికిత్సపై విద్యార్థులకు ప్రత్యక్ష శిక్షణ**



గుడివాడ, జూలై 14 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) విద్యార్థుల్లో అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన పెంపొందించి, అత్యవసర పరిస్థితుల్లో సమయస్ఫూర్తితో వ్యవహరించే నైపుణ్యాలను అలవర్చేందుకు గుడివాడ అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం నాలుగు విద్యాసంస్థల్లో అగ్నిమాపక అవగాహన కార్యక్రమాలు, మాక్‌డ్రిల్‌లు విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలు ఎస్.ఈ.ఆర్.ఎం. హై స్కూల్, గుడ్లవల్లేరు, మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్, గుడ్లవల్లేరు, ప్రతిభ విద్యాలయం, గుడ్లవల్లేరు, ఎ.ఏ.ఎన్.ఎం. వి.వి.ఆర్.ఎస్.ఆర్. పాఠశాల, గుడ్లవల్లేరు విద్యాసంస్థల్లో నిర్వహించగా, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుడివాడ అగ్నిమాపక కేంద్రం అధికారులు అగ్ని ప్రమాదాలకు దారితీసే కారణాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గ్యాస్ లీకేజీ, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వంటి ప్రమాదకర పరిస్థితుల్లో పాటించాల్సిన భద్రతా చర్యలను వివరించారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు భయాందోళనలకు గురికాకుండా సురక్షిత మార్గాల ద్వారా బయటకు వెళ్లే విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించారు. ఫైర్ ఎక్స్‌టింగ్విషర్‌ను సరైన పద్ధతిలో ఉపయోగించే విధానాన్ని వివరించడంతో పాటు, విద్యార్థులతోనే అగ్నిమాపక పరికరాలను వినియోగింపజేసి ప్రాక్టికల్ శిక్షణ అందించారు. అదేవిధంగా ప్రమాదంలో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతానికి తరలించే రెస్క్యూ పద్ధతులు, ప్రథమ చికిత్స అత్యవసర సేవలకు వెంటనే సమాచారం అందించే విధానంపై కూడా అవగాహన కల్పించారు. మాక్‌డ్రిల్ సందర్భంగా విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని అగ్ని ప్రమాద సమయంలో పాటించాల్సిన భద్రతా నియమాలను ప్రత్యక్షంగా నేర్చుకున్నారు. కార్యక్రమం అనంతరం పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గుడివాడ అగ్నిమాపక కేంద్రం అధికారులను అభినందిస్తూ, ఇటువంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో ధైర్యం, అప్రమత్తత, బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందించడంలో ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గుడివాడ అగ్నిమాపక కేంద్రం అధికారులు ప్రజలు, విద్యార్థులు అగ్ని ప్రమాదాల నివారణకు ఎల్లప్పుడూ భద్రతా నియమాలను పాటిస్తూ, ప్రమాదం సంభవించిన వెంటనే 101కు సమాచారం అందించాలని కోరారు.

# “27వ వార్డు బ్యాంక్ కాలనీ లో పార్కును సందర్శించిన మున్సిపల్ కమిషనర్”



తాడేపల్లిగూడెం జులై 14 (అవినాష్ మారంపూడి నేటి-శుభోదయ)::: తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ వీ. యేసుబాబు 27వ వార్డు బ్యాంక్ కాలనీ వద్ద గల పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ పార్కు ప్రాంగణంలో మొక్క నాటారు. అనంతరం పార్కు నిర్వహణ, పార్కు కమ్యూనిటీ, త్రాగునీటి సమస్యలు, డ్రైనేజీ సమస్యలపై స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్కును పరిశుభ్రంగా ఉంచాలని, పచ్చదనం పెంచేందుకు మరిన్ని మొక్కలు నాటాలని, విరిగిన ఆట వస్తువులు, బెంచీలను మరమ్మత్తులు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాలనీలో త్రాగునీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన పార్కులు అందుబాటులో ఉండాలని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులు కదలి సత్యనారాయణ వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తన స్వగ్రామమైన ‘గాదరాడ ప్రజా సేవ’లో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ..!!

**- గ్రామస్తులు, స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే..!**


**- సంబంధిత అధికారులతో అక్కడికక్కడే ఫోన్లో మాట్లాడి, సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని ఆదేశం.!**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యుల బత్తుల బలరామకృష్ణ మంగళవారం కోరుకొండ మండలం గాదరాడ గ్రామంలో ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గాదరాడ గ్రామస్తులు తమ ప్రాంతంలో ఎదుర్కొంటున్న మౌలిక వసతులు, రహదారులు, మరియు తాగునీటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సంబంధిత అధికారులతో అక్కడికక్కడే ఫోన్లో మాట్లాడి, సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా లేదా అని ఆయన ఆరా తీశారు. ఏ ఒక్క అర్హుడు పథకాలకు దూరంగా ఉండకూడదని, క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పనులు జరగాలని స్పష్టం చేశారు. గాదరాడ గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికాబద్ధంగా నిధులను మంజూరు చేయిస్తామని, గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో కీలకమని ఎమ్మెల్యే బలరామకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉమ్మడి కృష్ణా జిల్లాల జర్నలిస్ట్ లకు త్వరలో శిక్షణా తరగతులు

**-సీ ఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్**



అమరావతి, జులై 14 ( అజయ్ నారగాని,- నేటి శుభోదయ,) విజయవాడ జర్నలిస్ట్ లకు త్వరలో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు సీ ఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ వెల్లడించారు. విజయవాడ లోని సీ ఆర్ మీడియా అకాడమీ కార్యాలయంలో మంగళవారం ఆంధ్ర ప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు యేమినేని వెంకటరమణ, ఇస్కా రాజేష్ బాబు, రాష్ట్ర కార్యదర్శి వివేక్ యాదవ్, పసుపులేటి చైతన్య, రాజా, ప్రశాంత్, సీనియర్ జర్నలిస్ట్ వల్లూరు ప్రసాద్ కుమార్ తదితరులు అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ ను కలిసి జర్నలిస్ట్ ల సమస్యల పై చర్చించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో జర్నలిస్ట్ లకు శిక్షణా తరగతులు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్పందించిన ఆయన త్వరలో కృష్ణా జిల్లాతో పాటు ఎన్టీఆర్ జిల్లాలో కూడా శిక్షణా తరగతులు నిర్వహిస్థామని హామీ ఇచ్చారు.

# ‘విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన’ ఆధ్వర్యంలో రంపయర్రంపాలెంకు చెందిన 720 మంది మహిళలకు పట్టు చీరలు ఉచిత కానుక..!

**- రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ...**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);గోకవరం మండలం రంప యర్రంపాలెం గ్రామంలో కంబాల కానుక వనితలకు వేడుక పట్టు చీరలు పంపిణీ కార్యక్రమం సోమవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. తొలిత ఆయనకు కంబాల యువసేన అధ్యక్షులు ఉంగరాల మణిరత్నం ఆధ్వర్యంలో గ్రామ యువత, నాయకులు, కార్యకర్తలు కలిసి బైక్ ర్యాలీగా ప్రాంగణం వరకు తీసుకువెళ్లారు. అనంతరం గ్రామస్తులు, ఆలయాల కమిటీ సభ్యులు, అభిమానులు పూలవర్ష కురిపిస్తూ మహిళలు హారతులు పడుతూ ఘన స్వాగతం పలికి, శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. గ్రామంలోని పలు ఆలయాలను దర్శించుకుని, పూజలు నిర్వహించారు. గ్రామ దేవతలకు తొలితగా పట్టు చీరలను సమర్పించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనిలో భాగంగా 720 మంది మహిళలకు పట్టు చీరలను కంబాల శ్రీనివాసరావు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు కుటుంబ వ్యవస్థకు మూలస్తంభాలని, వారి సంక్షేమం, గౌరవం కోసం తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని తెలిపారు. మహిళా భక్తుల్లో హైందవ చైతన్యం తీసుకురావడం కోసం గత మూడేళ్ల నుంచి ఆషాఢ, శ్రావణ మాసాల్లో మహిళలకు పట్టు చీరలు, బంగారం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రజా సేవే తన లక్ష్యమని, సమాజంలోని ప్రతి వర్గానికి అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు...

# అగ్ని ప్రమాద బాధితులకు అండగా నేషనల్ జర్నలిస్ట్ ఎడిటర్స్ ఫోరం సభ్యులు చిరు సహాయం



బాపట్ల నేటి శుభోదయజులై 14 :బాపట్ల పట్టణం బాలకృష్ణాపురంలో సమ్మిటి పోలేరమ్మకు చెందిన పూరి ఇల్లు ప్రమాదవశాత్తు కాలిపోవడంతో బాధితులు కట్టుబట్టలతో రోడ్డుపై నిలబడ్డారు. ఈ విషయం తెలుసుకున్న నేషనల్ జర్నలిస్ట్ ఎడిటర్స్ ఫోరం సభ్యులు సమ్మిటి పోలేరమ్మను సంప్రదించి ఆమెకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. నేషనల్ జర్నలిస్ట్ ఎడిటర్స్ ఫోరం గౌరవ అధ్యక్షులు నారాయణ,ఆధ్వర్యంలో నేషనల్ జర్నలిస్ట్ ఎడిటర్స్ ఫోరం అధ్యక్షులు మార్పు వసంత బాబు, పసుమర్తి చైతన్య,జంగా జ్యోతి ప్రసాద్,పసుమర్తి ఆనంద్, తమనం శ్యామ్ పాల్,వీర్నపు జగ్గయ్య, సహకారంతో బాధితులకు నిత్యవసర వస్తువులు అందజేసిన సభ్యులు.

# జిల్లా కలెక్టర్ గారికి పోండ్ల గ్రామానికి చెందిన సత్యనారాయణ అనే వ్యక్తి ఫిర్యాదును పరిశీలిస్తున్న బాపట్ల మండల తాసిల్దార్ షాలిమా మరియు ఎంపీడీవో బాబురావు.



బాపట్ల నేటి శుభోదయ(రవి కిరణ్) జులై 14 :జిల్లా కలెక్టర్ గారికి పూండ్ల గ్రామానికి చెందిన లోకం సత్యనారాయణ సమర్పించిన ఫిర్యాదులో, రావిపాటి నాగేశ్వరరావు తన ఇంటి నుండి వెళ్లే మురుగునీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నారని పేర్కొనడంతో, ఆ ఫిర్యాదు మేరకు బాపట్ల మండల తహసీల్దార్ షాలిమా, ఎంపీడీవో శ్రీ బాబురావు , డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ గారు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ యేసయ్య , మండల సర్వేయర్ లక్ష్మి నారాయణ , ఎస్సై వెంకటేశ్వరరావు గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ నిర్వహించారు. విచారణ సందర్భంగా ఇరుపక్షాల వారిని వారి స్థలాలకు సంబంధించిన యాజమాన్య హక్కు పత్రాలను సమర్పించవలసిందిగా కోరగా, ఫిర్యాదుదారుడు లోకం సత్యనారాయణ తన సంబంధిత పత్రాలను సమర్పించారు. ప్రత్యర్థి పక్షం వారు తమ పత్రాలను సమర్పించుటకు గడువు కోరగా, అందుకు అవకాశం కల్పించబడింది. ఈ సందర్భంగా మురుగునీటి కాలువలకు సంబంధించి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలని తహసీల్దార్ ఆదేశించారు. అదేవిధంగా, సమస్యకు తాత్కాలిక పరిష్కారంగా అవసరమైన చోట సోక్‌పిట్ల నిర్మాణం కోసం అంచనాలు సిద్ధం చేయాలని ఎంపీడీవో ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. సర్వే పూర్తయిన అనంతరం ఇరుపక్షాల యాజమాన్య పత్రాలను సమగ్రంగా పరిశీలించి, మురుగునీరు ఎటువంటి అంతరాయం లేకుండా సహజంగా ప్రవహించే విధంగా నిబంధనలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ షాలిమా తెలిపారు.

# ముఠా గొడవలు, ఆస్తి వివాదం నేపథ్యంలో హత్య

**నిందితుడిని అరెస్ట్ చేసిన వెదుళ్లపల్లి పోలీసులు.**



బాపట్ల నేటి శుభోదయ(రవి కిరణ్)జులై 14 :బాపట్ల జిల్లా వెదుళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఒక దారుణ హత్య కేసుకు సంబంధించి నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం... బాపట్ల మండలం పెద్ద గ్యాంగ్ స్టూవర్ట్ పురం గ్రామానికి చెందిన కరెద్దుల జేబుదాసు అనే వ్యక్తికి, అర ఎకరం వ్యవసాయ భూమికి సంబంధించిన దీర్ఘకాలిక ఆస్తి వివాదం ఉంది. ఈ నేపథ్యంలో, ఈ నెల 9వ తేదీ మధ్యాహ్నం సుమారు 1.30 గంటల సమయంలో జేబుదాసు తన ఆస్తి వాటా గురించి అడగడానికి అదే గ్రామంలోని దేవర కృష్ణ అలియాస్ అబ్బన్న కోళ్ల ఫారం షెడ్ వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో అక్కడ ఆస్తి గురించి ప్రశ్నించిన జేబుదాసును చంపాల్సిందిగా తన వద్ద పనిచేసే దేవరకొండ కిషోర్ కుమార్ ను దేవర కృష్ణ ప్రేరేపించాడు. దీనితో కిషోర్ కుమార్ సమీపంలో ఉన్న ట్రాక్టర్ సైలెన్సర్‌తో జేబుదాసు తలపై బలంగా కొట్టాడు. ఈ దాడిలో తీవ్ర రక్తస్రావమై గాయపడిన జేబుదాసు, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 11వ తేదీ అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో మరణించాడు. ఈ ఘోరంపై మృతుడి తల్లి కరెద్దుల మానెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెదుళ్లపల్లి ఎస్ఐ ఎం. వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. బాపట్ల ఎస్పీ బి.ఉమా మహేశ్వరావు సూచనల మేరకు, బాపట్ల డీఎస్పీ సీహెచ్. చంద్రమౌళి గారి పర్యవేక్షణలో, బాపట్ల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.హరికృష్ణ తమ సిబ్బందితో కలిసి సోమవారం సాయంత్రం నిందితుడైన దేవరకొండ కిషోర్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం నిందితుడిని మంగళవారం కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.

# మేధ శ్రీనివాసరావుకు బాపట్ల జిల్లా ప్రెస్ క్లబ్ ఘన నివాళి



బాపట్ల నేటి శుభోదయ జులై 14 :బాపట్ల జిల్లా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో దివంగత సీనియర్ పాత్రికేయుడు మేధ శ్రీనివాసరావు స్మారకార్థం మంగళవారం సంతాప సభ నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేజండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ మేధ శ్రీనివాసరావు పాత్రికేయ రంగానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. నిబద్ధత, నిజాయితీతో కూడిన జర్నలిజానికి ఆయన ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ప్రెస్ క్లబ్ కార్యదర్శి బత్తుల యజ్ఞ సురేష్ మాట్లాడుతూ యువ పాత్రికేయులకు ఆయన మార్గదర్శిగా నిలిచారని, ఆయన చూపిన విలువలను కొనసాగించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రెస్ క్లబ్ జిల్లా సమాచార కార్యనిర్వహణాధికారి బంద్రెడ్డి గోపి మాట్లాడుతూ మేధ శ్రీనివాసరావు సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు మద్దిబోయిన గోపి, జోగి సువర్ణ రాజు, అక్కి శ్రీను,అంకమ్మరావు, శ్రీకాంత్,నాగరాజు, వివిధ మీడియా సంస్థల పాత్రికేయులు పాల్గొన్నారు.

# కాపు జాతి లో ‘ముద్రగడ’ చిరస్మరణీయుడు..!

**- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా.- ముద్రగడ మృతికి సంతాపం..!**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ (గ్రూజ) సభ్య డు ముద్రగడ పద్మనాభం మృతి పట్ల వైఎస్ఆర్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కం పూడి రాజా తీవ్ర దిగ్భ్రాం తి వ్యక్తం చేశారు. కాపుల రిజర్వేషన్ కోసం ముద్రగడ పద్మనాభం అలుపెరగని పోరాటం సాగించారన్నారు. కాపుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన ఉద్యమనేత అని కొనియాడారు. ఆయన మరణం రాష్ట్రానికి, వైఎస్ ఆర్ సీపీకి,ముఖ్యంగా కాపు సమాజానికి తీరని లోటని అన్నారు. ముద్రగడ పద్మనాభం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియ జేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ముద్రగడ పద్మనాభం సేవలు, పోరాట స్ఫూర్తి ఎప్పటికీ చిరస్మరణీయమని జక్కంపూడి రాజా పేర్కొ న్నారు.

# ముద్రగడ పద్మనాభం మృతికి పలువురు సంతాపం



విజయవాడ 14 జులై నేటి శుభోదయం : కాపు ఉద్యమ నేత మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఈరోజు హైదరాబాద్లోని ప్రైవేట్ హాస్పిటల్ లో శ్వాసకోస వ్యాధితో కన్నుమూశారు ఆయన కాపు ఉద్యమ నేతగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకి సుపరిచితం తునిలో రైలు దహనం కేసులో ఆయన జైలు పాలయ్యారు తర్వాత ఆ సంఘటన వల్లనే ఆంధ్రప్రదేశ్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది కాపులపై అంత ప్రభావం చూపిన ముద్రగడ పద్మనాభం ఆఖరిలో తన పేరుని రెడ్డిగా మార్చుకుని అపఖ్యాతి పాలయ్యారు ఆ దిగులు తోనే ఆయన ఈరోజు కన్నుమూశారు 1953 తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి లో ఆయన జన్మించారు 1978లో తొలిసారి జనతా పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు తర్వాత నాలుగు సార్లు ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందారు ఎన్టీఆర్ చెన్నారెడ్డి ప్రభుత్వంలో ఆయన మంత్రిగా పనిచేశారు రెడ్డిగా పేరు మార్చుకున్న తర్వాత కాపులందరికీ ఆయన దూరమయ్యారు ఆయన కుమార్తె మాట్లాడుతూ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి కనీసం పరామర్శిస్తానికి కూడా రాలేదు కానీ నా తండ్రి ఆయన కోసం కులమే మార్చుకున్నారు అని ఈ మధ్య మీడియాలో వాపోయారు ఏపీ తెలంగాణలోని పలువురు రాజకీయ నేతలు ఆయన మృతికి సంతాపం తెలియజేస్తున్నారు . విజయవాడలో ఒక కార్యక్రమం లో ఆయన మృతికి సంతాపం తెలియజేసిన వారిలో సంకు తిరుమల నాయుడు చింత పవన్ నాగ కుమార్ బందారు వెంకటరమణ శివాజీ అయ్యన్న మొదలవా రు ఉన్నారు.

# పారాక్వాట్ కలుపు మందుపై కేంద్రం నిషేధం

**రైతుల ఆరోగ్య పరిరక్షణకు చారిత్రాత్మక నిర్ణయం**

**: డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు (జీవీ)**




ఖమ్మం, నేటి శుభోదయ ::: రైతుల ఆరోగ్య భద్రత, పర్యావరణ పరిరక్షణ, సురక్షిత వ్యవసాయ విధానాల దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న పారాక్వాట్ కలుపు మందుపై దేశవ్యాప్త నిషేధ నిర్ణయం చారిత్రాత్మకమని శ్రీరక్ష మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు (జీవీ) పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు నేటి నుండి పారాక్వాట్ కలుపు మందు దిగుమతి, తయారీ, నిల్వ, అమ్మకం, రవాణా, వినియోగంపై దేశవ్యాప్తంగా నిషేధం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రపంచంలోని 70కి పైగా దేశాలు ఈ అత్యంత ప్రమాదకర రసాయనాన్ని నిషేధించగా, భారతదేశం కూడా అదే దిశగా అడుగులు వేయడం రైతుల ప్రాణాలను కాపాడే చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డా. జీవీ మాట్లాడుతూ శ్రీరక్ష ఆరోగ్య యాత్ర ద్వారా ఖమ్మం జిల్లాలోని సుమారు 100 గ్రామాల్లో రైతులకు పారాక్వాట్ వల్ల కలిగే తీవ్రమైన ఆరోగ్య సమస్యలు, విష ప్రభావాలు, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు వంటి కీలక అవయవాలపై కలిగే నష్టాలు, అలాగే ప్రాణాపాయ పరిస్థితులపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ ప్రజా ఆరోగ్య ఉద్యమంలో సీనియర్ వైద్యులు డా. షేక్ ఏడుకొండలుతో పాటు శ్రీరక్ష ఆరోగ్య యాత్ర బృందం గ్రామాల్లో ప్రత్యక్షంగా పర్యటిస్తూ రైతుల్లో చైతన్యం తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిందని ఆయన పేర్కొన్నారు. పారాక్వాట్ పూర్తిస్థాయిలో నిషేధించబడే వరకు ప్రజా ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా తమ పోరాటాన్ని నిరంతరం కొనసాగించామని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రైతుల ఆరోగ్య భద్రత కోసం సాగిన ఉద్యమానికి లభించిన గొప్ప విజయంగా భావిస్తున్నట్లు డా. జీవీ తెలిపారు. ఇంతకుముందే రాష్ట్ర ప్రభుత్వం కూడా పారాక్వాట్‌పై నిషేధ చర్యలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిషేధాన్ని అమలు చేయడం రైతు సంక్షేమానికి మరింత బలాన్నిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు డా. గోంగూర వెంకటేశ్వర్లు (జీవీ) కి అభినందనలు తెలియజేస్తూ, రైతుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆయన చేపట్టిన నిరంతర అవగాహన కార్యక్రమాలను ప్రశంసించారు. చింతకాని గ్రామ సర్పంచ్ మనోహర్, బోనకల్ గ్రామ సర్పంచ్ జ్యోతికొండ, ముష్టికుంట్ల గ్రామ సర్పంచ్ పిల్లలమర్రి నాగేశ్వరరావు, గువ్వలగూడెం గ్రామ సర్పంచ్ జ్యోతి, రావినూతల గ్రామ సర్పంచ్ భద్రు, కాకరవాయి గ్రామ సర్పంచ్ ఉపేందర్, ఆళ్లపాడు గ్రామ సర్పంచ్ కోటేశ్వరరావు, చిరుమర్రి గ్రామ సర్పంచ్ రాంబాబు తదితర గ్రామ పంచాయతీ సర్పంచులు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, రైతుల ఆరోగ్య పరిరక్షణ కోసం డా. జీవీ చేసిన విశేష కృషిని అభినందించారు. అదేవిధంగా, రైతుల సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యతగా భావించి ఈ కీలక నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వానికి డా. గోంగూర వెంకటేశ్వర్లు (జీవీ) హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. “రైతు ఆరోగ్యం -- దేశ ఆరోగ్యం. సురక్షిత వ్యవసాయమే సుస్థిర భారతానికి పునాది.” అనే సందేశంతో ప్రతి రైతు ప్రమాదకర రసాయనాల వినియోగాన్ని పూర్తిగా నివారించి, సురక్షితమైన శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని డా. జీవీ పిలుపునిచ్చారు.

## ముద్రగడ పద్మనాభం మృతికి 'అనంత' సంతాపం



అనంతపురం, జులై 14 నేటి శుభోదయ :మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మృతికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి సంతాపం తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ముద్రగడ తుదిశ్వాస విడవడం బాధాకరమన్నారు. ముద్రగడ పద్మనాభం ఎమ్మెల్యేగా, ఎంపీగా పని చేశారని.. మంత్రిగానూ తనదైన ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. కాపు సామాజికవర్గ హక్కుల పోరాటాల్లో ముద్రగడది కీలకపాత్ర అని తెలిపారు. కాపు సామాజిక వర్గంలోనే కాకుండా అన్ని వర్గాల్లో ముద్రగడకు అభిమానులు ఉన్నారని పేర్కొన్నారు. కాపు రిజర్వేషన్ల కోసం అహర్నిశలు కృషి చేసిన ఆయన మరణం బాధాకరమని తెలిపారు. ఓ మంచి వ్యక్తిని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోల్పోయిందని, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## - ముద్రగడ మృతి పట్ల సంతాపం తెలిపిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



హైదరాబాద్, నేటి శుభోదయ ::: మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మృతి పట్ల బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.కాపుల న్యాయమైన హక్కుల సాధనకు ఆయన అకుంఠిత దీక్షతో పోరాడారని,ఉమ్మడి రాష్ట్రంలో శాసనసభ్యుడిగా, మంత్రిగా ప్రజలకు విశేష సేవలందించారని తన సంతాప సందేశంలో ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.ప్రజా జీవితంలో తనదైన ముద్ర వేసిన ముద్రగడ తెలుగు రాష్ట్రాల రాజకీయాలకు తీరని లోటు అన్నారు.స్వర్గీయ పద్మనాభం ఆత్మకు శాంతి చేకూరాలని ఎంపీ వద్దిరాజు భగవంతున్ని ప్రార్థిస్తూ,ఆయన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అనుచరులు,అభిమానులకు తీవ్ర సంతాపం తెలిపారు, ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు.

## ముద్ర గడ మరణం కాపు జాతి కి తీరని లోటు : ఆర్జేసి కృష్ణ



ఖమ్మం, నేటి శుభోదయ ::: ముద్రగడ పద్మనాభం మరణం కాపు అనుబంధ కులాలకు తీరని లోటు అని మున్నూరు కాపు సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు గుండాల కృష్ణ పేర్కొన్నారు.1953 లో తూర్పు గోదావరి జిల్లా కిర్లంపూడి లో జన్మించిన ఆయన మంత్రి గా,ఎం ఎల్ ఏ గా పనిచేశారని తెలిపారు.కాపుల రిజర్వేషన్ పై పోరాటం చేశారని ఆయన గుర్తు చేశారు .కాపు సమాజం కోసం అనేక ఉద్యమాలు,పోరాటాలు చేశారని, ఆయన మరణం తో కాపు జాతి పెద్దదిక్కును కోల్పోయినట్లయ్యిందని పేర్కొన్నారు. ఆయన మృతి కి ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు.కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ముద్రగడ పద్మనాభం మృతికి మాజీ ఎంపీ నామ సంతాపం



హైదరాబాద్, ఖమ్మం, నేటి శుభోదయ ::: మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మృతికి బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ప్రజా జీవితంలో ఆయన అందించిన సేవలు, కాపు సామాజిక వర్గ హక్కుల కోసం చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ముద్రగడ పద్మనాభం మరణం తెలుగు రాష్ట్రాల రాజకీయాలకు తీరని లోటని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, భగవంతుడు వారికి ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ప్రసాదించాలని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## ముద్రగడ పద్మనాభం మృతికి మాజీ ఎంపీ నామ సంతాపం



హైదరాబాద్, ఖమ్మం, నేటి శుభోదయ ::: మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మృతికి బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ప్రజా జీవితంలో ఆయన అందించిన సేవలు, కాపు సామాజిక వర్గ హక్కుల కోసం చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ముద్రగడ పద్మనాభం మరణం తెలుగు రాష్ట్రాల రాజకీయాలకు తీరని లోటని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, భగవంతుడు వారికి ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ప్రసాదించాలని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించా

## ఘనంగా శ్రీశ్రీశ్రీ వారాహి అమ్మ వారి నవరాత్రుల పూజ మహోత్సవములు....

**- ముఖ్య అతిథులుగా బిజెపి ఇంచార్జ్ కరణం రెడ్డి నర్సింగరావు, స్థానిక వార్డ్ కార్పొరేటర్ బొండా జగన్నాథం (జగన్)**



( నేటి శుభోదయ : జులై 15 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) గాజువాక నియోజకవర్గం 87వ వార్డు పరిధిలో మీ సేవ గ్రౌండ్లో శ్రీశ్రీశ్రీ వారాహి అమ్మవారి నవరాత్రి పూజ మహోత్సవములు అత్యంత వైభవంగా ప్రారంభించబడనున్నాయి . ఈ కార్యక్రమాలను పరిశీలించుటకు గాజువాక నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ కరణం రెడ్డి నర్సింగరావు, మాజీ స్థానిక వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం (జగన్) విచ్చేయడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ బుధవారం నుండి ప్రారంభం కాబోతున్న శ్రీశ్రీశ్రీ వారాహి అమ్మవారి నవరాత్రుల పూజ మహోత్సవములు వేద పండితులు శ్రీహరి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్నాయని ప్రతి ఒక్కరూ ఈ పూజా మహోత్సవంలో పాలుపంచుకోవాలని ప్రతి రోజు ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆ అమ్మవారి కరుణ కటాక్షం పొందాలని కోరారు.

## "ముద్రగడ పద్మనాభం మృతి రాష్ట్రానికి తీరని లోటు

**-- వడ్డీ రఘురాం నాయుడు"**



తాడేపల్లిగూడెం, జూలై 14 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ)::: ప్రముఖ కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే ముద్రగడ పద్మనాభం మృతి పట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.ముద్రగడ పద్మనాభం మరణం రాష్ట్ర రాజకీయాలకు, ముఖ్యంగా కాపు సామాజిక వర్గానికి తీరని లోటని ఆయన పేర్కొన్నారు. ప్రజాప్రతినిధిగా, మంత్రిగా, శాసనసభ్యుడిగా, ఎంపీగా ఆయన నిర్వహించిన ప్రతి పదవికి తన నిజాయితీ, నిబద్ధత, ప్రజాసేవతో ప్రత్యేక వన్నె తీసుకొచ్చారని కొనియాడారు.కాపు సామాజిక వర్గం హక్కులు, రిజర్వేషన్లు, సంక్షేమం కోసం ఆయన జీవితాంతం అలుపెరగని పోరాటం చేశారని అన్నారు. ప్రజా సమస్యలపై రాజీపడని నాయకుడిగా, ఉద్యమ స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన ముద్రగడ పద్మనాభం సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.ప్రజా జీవితంలో విలువలు, నిబద్ధత, ధైర్యసాహసాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన ఆయన తరతరాలకు స్ఫూర్తిగా నిలిచే నాయకుడని రఘురాం నాయుడు అన్నారు.ముద్రగడ పద్మనాభం ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## చిరస్థాయిగా ఎస్ జానకి సంగీత గానామృతం నిలుస్తుంది

**- ప్రకాశం జిల్లా సంగీత కళాకారుల సమాఖ్య**



ఒంగోలు, నేటి శుభోదయ ::: దక్షిణ భారత గాన కోకిలగా సుప్రసిద్ధులైన ఎస్. జానకి 1938సం. ఏప్రిల్ 23న ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా పల్లపట్ల గ్రామంలో జన్మించారని ఆయుర్వేద వైద్యులు, ఉపాధ్యాయులు అయిన సిస్టా శ్రీరామమూర్తి సత్యవతి దంపతుల బిడ్డగా ఆరు దశాబ్దాల పాటు సంగీత సామ్రాజ్యంలో తమ ప్రస్థానం కొనసాగిందని. తెలుగువారైనా తన తొలి పాట తమిళంలో ప్రారంభమైందని, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం హిందీ భాషలతో పాటు 20 కు పైగా భారతీయ మరి విదేశీ భాషలలో అద్భుతంగా తమ సంగీత ప్రస్థానం కొనసాగించారని వక్తలు పేర్కొన్నారు. 48వేలకు పైగా పాటలు ఆలపించారని, తమ ప్రత్యేకమైన గాత్రంతో సంగీత ప్రియులను అలరించారని, సినిమా పాటలతో పాటు ఆధ్యాత్మిక కీర్తనలు కూడా ఆలపించారని, ఎక్స్ప్రెషన్ అండ్ మోడ్యులేషన్ క్వీన్ గా ప్రపంచ సంగీత అభిమానులు కీర్తించారని తెలిపారు, మొన్న జులై 11వ తేదీ వారి మరణంతో సంగీత ప్రపంచం ప్రముఖ సంగీత కళాకారుని కోల్పోయిందని డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ పేర్కొన్నారు. 2013 సంవత్సరంలో ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డును ప్రకటించి అందజేశారని గుర్తు చేశారు, వాటితో పాటు జాతీయ అవార్డులు, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్ జానకి సంగీతాన్ని గుర్తించి అందించిన అవార్డులు లెక్కకు మిక్కుటంగా ఉన్నాయని తెలిపారు. ఎస్. జానకి తన మధురమైన గొంతుతో దశాబ్దాల పాటు సంగీత ప్రియులను అలరించారు, తెలుగు నేల గర్వించదగ్గ గొప్ప గాయనిగా ఆమె చిరస్మరణీయమైన ముద్ర వేశారని అన్నారు.జూలై 14వ తేదీ స్థానిక సి వి ఎన్ రీడింగ్ రూమ్ లో ది ప్రకాశం జిల్లా సంగీత కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు ఎస్ కే బాబు ఆధ్వర్యంలో ప్రఖ్యాత గాయని ఎస్ జానకమ్మ కి అంజలి కట్టించే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంగీత కళాకారులు పాల్గొని జానకి కి నివాళులర్పించి వారి తో ప్రకాశం జిల్లాకు ఒంగోలు సంగీత కళాకారులకు అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సంగీత కళాకారులు సమాఖ్య వ్యవస్థాపకులు ఎన్ సుకుమార్ అధ్యక్షులు ఎస్కే బాబు కార్యదర్శి ఎ మనోహర్ కార్యదర్శి చల్ల నాగేశ్వరమ్మ కన్వీనర్ టి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ ఎస్ పి భూమి కబ్జా

**- మొద్దు నిద్రలో అధికారులు**

**ఎన్ ఎస్పి భూములపై అధికారుల అలసత్వం**

**- ఎన్ఎస్పి భూములలో శాశ్వత కట్టడాలు**



ఖమ్మం, ఏన్కూరు, శుభోదయం ::: ఏన్కూరు మండల పరిధిలో గల ఎన్ఎస్పి భూములు కబ్జా చేసి భూమిని స్వాధీన పరచుకొని శాశ్వత కట్టడాల అదేవిధంగా కొంతమంది రైతులు పంటలు వేసుకుంటున్న చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు. ఎన్.ఎస్.పి అధికారులను కొందరు కొన్ని విధాలుగా ఎన్ఎస్పి కబ్జా చేసిన వారు లోబరుచుకున్నారు అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితిలో ఎన్ఎస్పి భూములు అనేక రకాలుగా అనేక విధాలుగా ఎవరికి తోచినట్లు వారు కబ్జా చేసుకుంటూ ఉండటం చాలా విడ్డూరంగా ఉన్నది అదే విధంగా ఆ కబ్జా చేసిన భూములలో శాశ్వత కట్టడాలు కడుతున్న అధికారులు చూసి చూడనట్లు ఉండి ప్రభుత్వ భూములను ఖబ్జా చేయడంలో మీరు సహాయపడుతున్నారు అనే ఆరోపణలు వస్తున్నాయి. అసలు ఎంఎస్పి అధికారుల పర్యవేక్షణ లో ఉన్న ఎన్ఎస్పి కెనాల్ లలో అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు అనే అనుమానాలు ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ప్రతినిత్యం కాలవలపై తిరిగే లస్కర్ నుంచి మండలస్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి అధికారుల వరకు ఎందుకు మౌనం వహిస్తున్నారు ఈ కబ్జాను ఎందుకు ఆపలేకపోతున్నారు? ప్రభుత్వ సొమ్మును ప్రతి నెల జీతం రూపంలో లక్షలు లక్షలు తీసుకుంటూ ప్రభుత్వ భూములనే కబ్జా చేస్తున్న ఎందుకు మౌనం వహిస్తున్నారు? అనే సందేహాలు వ్యక్తం అవుతున్న సందర్భంలో వీరిపై మరికొన్ని కథనాలు వచ్చే సంచికలో...!

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి..



( నేటి శుభోదయ జులై :15 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖ 28 వార్డ్ రామ్ నగర్ దరి జెఎస్ఎం కాలనీ వాసులకు మంగళవారం త్రీటౌన్ సీఐ అప్పలనాయుడు, ఎస్సై చిన్నం నాయుడు భద్రతపై అవగాహన కల్పించారు. కాలనీలో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 112 కు సమాచారం ఇవ్వాలన్నారు. భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు కేజీ టు పీజీ ఉచిత విద్య

**- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య**




హైదరాబాద్, నేటి శుభోదయ : తెలంగాణలో అక్రెడిటేషన్ కార్డుతో సంబంధం లేకుండా జర్నలిస్టుల పిల్లలకు కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యను అందించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధి బృందం సచివాలయంలో రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ వివిధ పత్రికలు, చానళ్లల్లో పని చేస్తున్న అనేక మంది జర్నలిస్టులు సరైన వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, తమ పిల్లలను ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదించుకోలేక పోతున్నారని అన్నారు.జర్నలిస్టుల ఆర్థిక స్థితిగతులను దృష్టిలో పెట్టుకొని వారి పిల్లలకు అన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యను అందించేందుకు ప్రభుత్వం జీవో జారీ చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా అన్ని గురుకుల విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు సీట్ల కేటాయింపులో ప్రత్యేక కోటా ఇవ్వాలని మామిడి సోమయ్య విజ్ఞప్తి చేశారు.

- జర్నలిస్టుల పిల్లలకు గురుకులాల్లో ప్రత్యేక కోటా

జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉచిత విద్య అందించే విషయాన్ని పరిశీలిస్తామని ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా అన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ఏ రాష్ట్రంలోనైనా ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉచితంగా విద్యను ఇస్తున్నట్లయితే దాని వివరాలు ఇవ్వాలని ఆమె ఫెడరేషన్ ప్రతినిధులను కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిశీలిస్తానని చెప్పారు. రాష్ట్రంలో అత్యుత్తమంగా నడుస్తున్న గురుకుల విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు ప్రత్యేక కోటా కింద సీట్లు ఇస్తామని ఆమె హామీ ఇచ్చారు. ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాకార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు కుంచెం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వి. రవికుమార్ తదితరులున్నారు.

## ముద్రగడ పద్మనాభం కన్నుమూత ఒక ధీర యోధుడి ప్రస్థానానికి ముగింపు

నేటి శుభోదయ జులై :15 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో, ముఖ్యంగా సామాజిక పోరాటాల్లో ఒక ధ్రువతారగా వెలుగొందిన ప్రముఖ కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం కన్నుమూశారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్తతో తెలుగు రాష్ట్రాల్లోని ఆయన అభిమానులు, అనుచరులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు.



రాజకీయ ప్రస్థానం - ఒక పరిచయం

తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ముద్రగడ పద్మనాభం, దశాబ్దాల పాటు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో క్రియాశీలకంగా పనిచేశారు.

రాజకీయ రంగం:

ఒకప్పుడు మంత్రిగా, శాసనసభ్యుడిగా పనిచేసి, ప్రజా సమస్యలపై ఎప్పుడూ గళం విప్పిన వ్యక్తి ఆయన.

కాపు ఉద్యమం:

ఆయనను చరిత్ర గుర్తుంచుకోవడానికి ప్రధాన కారణం 'కాపు రిజర్వేషన్ల' కోసం ఆయన చేసిన సుదీర్ఘ పోరాటం. వెనుకబడిన వర్గాల హక్కుల కోసం ఎటువంటి రాజీ లేకుండా పోరాడిన యోధుడిగా ఆయనకు గుర్తింపు ఉంది.

నిరసన దీక్షలు:తన డిమాండ్ల సాధన కోసం ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టి, రాష్ట్ర ప్రభుత్వాన్ని సైతం ఆలోచింపజేసిన సందర్భాలు అనేకం.నిరాడంబరతకు మారుపేరుముద్రగడ పద్మనాభం ప్రత్యేకత ఏమిటంటే.. ఆయన పోరాటంలో చూపిన పట్టుదల. ఎన్నో ఒడిదుడుకులు, రాజకీయ ఇబ్బందులు ఎదురైనప్పటికీ, తన సిద్ధాంతాల కోసం చివరి వరకు నిలబడ్డ వ్యక్తిత్వం ఆయనది. ఆయన మరణం కాపు సామాజిక వర్గానికి, రాష్ట్ర రాజకీయాలకు తీరని లోటు.అశ్రునయనాలతో నివాళిముద్రగడ మరణంతో ఆయన స్వస్థలంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు పలువురు రాజకీయ ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు తరలివస్తున్నారు. ప్రజా పోరాటాల చరిత్రలో ముద్రగడ పద్మనాభం పేరు సువర్ణాక్షరాలతో లిఖించబడుతుంది.

## స్వర్ణకార సంఘానికి బీఆర్ఎస్ నేతల సత్కారం

**- నాడు పువ్వాడ హయాంలోనే స్వర్ణకారుల అభ్యున్నతి**



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నగర స్వర్ణకార సంఘ ఎన్నికలో మూడోసారి ఘన విజయం సాధించిన నూతన కార్యవర్గ సభ్యులను మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం అధ్యక్షుడిగా బీఆర్ఎస్ పార్టీ 34వ డివిజన్ అధ్యక్షులు బీఆర్ఎస్ గౌరోజు వసంతబాబు, ప్రధాన కార్యదర్శిగా కోటగిరి నాగేశ్వరరావు, కోశాధికారిగా బ్రహ్మోజీ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు వసంత బాబు మాట్లాడుతూ గత మూడు పర్యాయాలుగా స్వర్ణకారుల సంక్షేమానికి కృషి చేశామని బ్రహ్మం కళ్యాణ మండపం పునర్నిర్మాణం పేద స్వర్ణకారుల వివాహాలకు పుస్తెలు బహుకరణ, ఆర్థిక సహాయ సహకారాలు వంటి కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీమంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చొరవతో చిన్న స్వర్ణకారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, 50 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరు చేయించామని చెప్పారు. ప్రస్తుతం కార్పొరేట్ సంస్థల ప్రభావంతో చిన్న స్థాయి స్వర్ణకారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, గుండాల కృష్ణ, మెంతుల శ్రీశైలం, మాటేటి నాగేశ్వరరావు, పసుమర్తి రామ్మోహన్ రావు, కొత్త వెంకటేశ్వరరావు, కనకం భద్రయ్య, బోజడ్ల రామ్మోహన్, యర్రా అప్పారావు, మాటేటి కిరణ్, మిట్టపల్లి రవి, తోట రమేష్, దడాల రఘు, అద్దంకి శివ, బొల్లేపల్లి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## చనిపోయిన 72 గంటల్లో నష్ట పరిహారం ఇచ్చాం..!!

**- పల్లా శ్రీనివాసరావు**




( నేటి శుభోదయ జులై : 15 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) వైసిపి హయాంలో గల్లంతు ఐన మత్స్యకారులకు నష్ట పరిహారంఇవ్వక పోతే కూటమి ప్రభుత్వం వచ్చాక మూడు కోట్లు పరిహారం ఇచ్చారు.ప్రమాదంలో ఉన్న మత్స్యకారులు సమాచారం ఇస్తే ప్రభుత్వానికి పోర్ట్ కి చెప్పకుండా కుట్ర చేశారు.ప్రాణాలతో బయట పడ్డ డ్రైవర్ కి బోటు కూడా ఫిషరీస్ విభాగం ఇస్తుంది.కూటమి ప్రభుత్వం బాధ్యతగా ఉంది . వెలగపూడి రామకృష్ణ బాబు- తూర్పు నియోజక వర్గ శాసన సభ్యులు మాట్లాడుతూ

2019 నుంచి 2024 వరకు 63 మంది మత్స్యకారులకు నష్ట పరిహారం ఇచ్చాం.మత్స్యకారులకు ఒక జీ పి ఎస్ ఇవ్వలేదు, బోటు ఇవ్వలేదు ,ఇంజినేవ్వలేదుకూటమి ప్రభుత్వంలో 50శాతం రాయితీతో ఇంజన్ , బోట్లు ఇచ్చాం.మత్స్యకారులు మధ్య విబేధాలు తెచ్చిన వ్యక్తి మాజీ మంత్రి సి అప్పలరాజు. మత్స్యకారుల దగ్గర కల్ల బొల్లి మాటలొద్దు..జగన్ .చోడే పట్టాభిరామ్, విశాఖ టీడీపీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ

గుడివాడ అమర్నాథ్ ఇంటి ముందు ఉన్న కిమ్స్ ఆసుపత్రి లో కారే చిన్న ను కనీసం పరామర్శించలేదు. ప్రతి తల్లి కి ,చెల్లి కి న్యాయం చేస్తాం అంటున్న ..జగన్ ..సొంత తల్లి చెల్లి కి న్యాయం చెయ్యలేదు .సీతాంరాజు సుధాకర్ , యన్ టి ఆర్ వైద్య సేవా ఛైర్మన్ మాట్లాడుతూశ్రీకృష్ణ దేవరాయలు మించిన భాండాగారం జగన్ కి ఉంది ఆ నిధి నుంచి బాధితులు ఆదుకుంటే మంచిది జగన్ జిమ్మిక్కులు విశాఖ ప్రజలు నమ్మరు..ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు,వెలగపూడి రామకృష్ణ బాబు తూర్పు నియోజక వర్గ శాసన సభ్యులు, చోడే పట్టాభిరామ్, విశాఖ టీడీపీ జిల్లా అధ్యక్షుడు, వి ఎం ఆర్ డి ఏ చైర్మన్ ఎం ప్రణగోపాల్,సీతాంరాజు సుధాకర్ , యన్ టి ఆర్ వైద్య సేవా ఛైర్మన్, విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి లొడగల కృష్ణ, బైరెడ్డి పోతం రెడ్డి మీడియా కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు,

## ఆటో డ్రైవర్లకు అండగా ఉంటా

**- వారి సమస్యలను పరిష్కరిస్తా ఎమ్మెల్యే గద్దె**




విజయవాడ, జూలై 14 (నేటి శుభోదయ):-ఆటో డ్రైవర్లకు అండగా ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు బాధ్యతను నిర్వహిస్తానని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. తూర్పు లోని ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణలో టీఎన్‌టీయూసీ ఆటో కార్మికుల 5వ రూట్ అమరావతి ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ సొసైటీ నూతన అధ్యక్షుడి ఎన్నిక మంగళవారం ఉదయం జరిగింది. అనంతరం ఆటో డ్రైవర్ల సమస్యలపై ఎమ్మెల్యే గద్దె వారితో ప్రత్యేకంగా చర్చించారు. సొసైటీ నూతన అధ్యక్షుడిగా మిర్యాల సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా వీవీడీ.శివప్రసాద్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలతో నేరుగా సంబంధం ఉన్న రంగం ఆటో రంగమేనని తెలిపారు. ఆటో డ్రైవర్లతో నిత్యం ఎంతో మంది ప్రయాణికులు మాట్లాడుతుంటారని అందువల్ల వారికి పబ్లిక్ టాక్ చాలా స్పష్టంగా తెలుస్తుందని అభిప్రాయపడ్డారు. క్రమశిక్షణతో వాహనాలను నడిపేది ఆటో డ్రైవర్లేనని పేర్కొన్నారు. ప్రయాణీకులను సొంత కుటుంబ సభ్యుల మాదిరిగా భావించి వారిని క్షేమంగా గమ్యస్థానాలకు తీసుకువెళ్ళాలని చెప్పారు. ఆటోలపై చలనాలను విధించవచ్చునని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పోలీసు శాఖకు చాలా స్పష్టంగా చెప్పారని, అప్పటి నుంచి ఆటో డ్రైవర్లపై ఎటువంటి చలనాలు విధించడం లేదన్నారు. పోలీసులు ఇబ్బందులు పెడితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని గద్దె చెప్పారు. ఆటో డ్రైవర్ల సమస్యలను తన సొంత సమస్యలుగా భావించి పరిష్కరించడానికి కృషి చేస్తానని, అదే విధంగా ఆటో డ్రైవర్లు కూడా బాధ్యతగా క్రమశిక్షణతో వ్యవహరించాలని సూచించారు. ఆటో డ్రైవర్లకు తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని ఎమ్మెల్యే చెప్పారు.గొట్టుముక్కల రఘు మాట్లాడుతూ ఏ సమస్య ఉన్నా ఎమ్మెల్యే గద్దె అండగా ఉంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నూతక్కి రాము, రాయవరపు అశోక్, షరీఫ్, ఎస్.అప్పారావు, సత్యనారాయణ, కెల్ల రమేష్ నాయుడు, కృష్ణ, రమేష్, మంగళగిరి శివ, నాయుడు, నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

# కేరళలో అత్యధిక ఉష్ణోగ్రతలు

## - సెల్ఫ్ లాక్ డౌన్ కు సిఎం పిలుపు



తిరువనంతపురం : కేరళలో గత రెండు రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. ఆ రాష్ట్రంలో అధిక తేమతో కూడిన తీవ్రమైన వేడి కనీసం ఏప్రిల్ 27 వరకు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ డైరెక్టర్ నీతా కె. గోపాల్ వెల్లడించారు. వడదెబ్బకు ఇప్పటికే ఆ రాష్ట్రంలో ఒకరిద్దరు మరణించారు. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ కోవిడ్-19 తరహాలో ఇప్పుడు సెల్ఫ్ లాక్ డౌన్ (స్వీయ నిర్బంధం) పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తీవ్రమైన ఎండ తగిలే సమయాల్లో నేరుగా సూర్యరశ్మికి గురికాకుండా ఉండేందుకు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల మధ్య అనవసర ప్రయాణాలు, బహిరంగ ప్రదేశాలలో పనులు మానుకోవాలని ఆయన సలహా ఇచ్చారు. అలాగే ఈ సమయంలో బహిరంగ ప్రదేశాల్లో సమావేశాలు, క్రీడా కార్యక్రమాలు నిషేధించనున్నట్లు వెల్లడించారు. వడగాలుల హెచ్చరికల దృష్ట్యా, పాలక్కాడ్, కొల్లాం, త్రిస్సూర్ జిల్లాల్లో పండుగల సమయంలో పగటిపూట జరిగే ఏనుగుల ఊరేగింపులు, బాణాసంచా ప్రదర్శనలను నివారించాలని లేదా వాయిదా వేయాలని ఆయన ఆదేశించారు. అలాగే ప్రయాణికులకు, ప్రజలకు తాగునీటిని అందించడానికి నీటి ట్యాంకులను, నీడ ఉన్న విశ్రాంతి ప్రదేశాలను ఏర్పాటు చేయాలని స్థానిక సంస్థలు, కుటుంబశ్రీ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారులకు ఆయన విజ్ఞప్తి చేశారు. అలసట లేదా వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే, వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని ఆయన సూచించారు. ఎండదెబ్బకు ఎవరైనా ఇబ్బంది పడుతున్నట్లు కనిపిస్తే వెంటనే వారిని నీడ ఉన్న ప్రదేశానికి తరలించి వైద్య సహాయం అందించాలని విజయన్ కోరారు.. బుధవారం పాలక్కాడ్‌లో గరిష్ట ఉష్ణోగ్రత 41.1°cకి చేరింది, ఇది సాధారణం కంటే 4.7°c ఎక్కువ.. పునలూరులో 39.8°c (ఇది కూడా సాధారణం కంటే 4.7జ ఎక్కువ), వెల్లనిక్కరలో 39.3°c (ఇది సాధారణం కంటే 4.5°c ఎక్కువ) ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి

## ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీకి తీవ్ర గాయాలు



ట్రెహాన్ : అమెరికా--ఇజ్రాయెల్ వైమానిక దాడిలో ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ త్రీవంగా గాయాలపాలయ్యారు. ఈ విషయాన్ని న్యూయార్క్ టైమ్స్ గురువారం నివేదించింది. ఇప్పటికే అమెరికా దాడిలో మొజ్తాబా తండ్రి అలీ ఖమేనీ మృతి చెందారు. అమెరికా దాడిలో మొజ్తాబాకి గాయాలయ్యాయని.. దీంతో ఆయన ప్రస్తుత నిర్ణయాధికారాన్ని రివల్యూషనరీ గార్డ్స్ యొక్క సైద్ధాంతిక సైన్యంలోని జనరల్స్‌కు అప్పగించారని పేర్లను వెల్లడించని పలువురు ఇరానియన్ అధికారులను ఉటంకిస్తూ టైమ్స్ ప్రతిక పేర్కొంది. కాగా, మొజ్తాబా ఖమేనీ తన తండ్రి తర్వాత సుప్రీం లీడర్ గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి బహిరంగంగా కనిపంచలేదు. కేవలం ఆయన నుంచి లిఖితపూర్వక ప్రకటనలు మ్రాతమే వెలువడుతున్నట్లు కనిపిస్తోంది. దీంతో అసలు ఆయన బతికే ఉన్నారా? లేదా? అనే ఊహాగానాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో న్యూయార్క్ టైమ్స్ పత్రిక మొజ్తాబాకి గాయాలయ్యాయని ప్రకటించడంతో ఊహాగానాలు నిజమేనని తెలుస్తోంది.

## శంకర్ గౌడ్ మృతదేహాన్ని తరలించే యత్నం.. తీవ్ర ఉద్రిక్తత



వరంగల్: నర్సంపేట మండలం ముత్తోజిపేట గ్రామంలో శుక్రవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ భౌతిక కాయానికి నివాళులర్పించి.. ఆయన కుటుంబాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ పరామర్శించారు. ఆ సమయంలో శంకర్ మృతదేహాన్ని డిపో వరకూ తీసుకెళ్తామని కార్మికులు ఆయనతో అన్నారు. అయితే పోలీసులు అందుకు ఒప్పుకోకపోవడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. ఇదే విషయమై ఆర్టీసీ కార్మికులకు ఉదయం పోలీసులు అభ్యంతరం చెప్పారు. ఆ సమయంలోనూ ఇరు వర్గాల మధ్య తోపులాట చోటు చేసుకుంది. కార్మికులను అరెస్ట్ చేసిన పోలీసులు.. శంకర్‌గౌడ్ ఇంటి వద్ద వేసిన టెంట్‌ను సైతం తొలగించారు. కాసేపటికి కేంద్ర మంత్రి బండి సంజయ్ అక్కడికి వచ్చారు. ఆ సమయంలోనూ కార్మికులు అదే డిమాండ్ చేశారు. డిపో వద్ద తమ తోటి కార్మికుడి మృతదేహానికి నివాళు లర్పించేందుకు అనుమతించాలని పోలీసులను కోరారు. అందుకు అనుమతి ఇవ్వకపోవడంతో పోలీసుల వైఖరిని బండి సంజయ్ తప్పుబట్టారు. ఎవరు అడ్డుకుంటారో చూస్తాం.. మీరు తీసుకెళ్లండి అని కార్మికులతో అన్నారాయన. ఆ సమయంలో పోలీసులు భారీగా మోహరించడంతో అక్కడ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. మరోవైపు కొందరు కార్మికులు, బీజేపీ కార్యకర్తలు పోలీసులను దాటుకుని రోడ్డుపై శంకర్ గౌడ్ మృతదేహాన్ని నెట్టుకుంటూ తరలించే ప్రయత్నం చేశారు. తెలంగాణలో ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగిన సంగతి తెలిసిందే. నిన్న సమ్మె రెండు రోజు జరగ్గా.. నర్సంపేట డిపోలో డ్రైవర్‌గా పని చేసే కోలా శంకర్‌గౌడ్ ప్రభుత్వ తీరుకు నిరసగా పెట్రోల్ పోసుకుని నిప్పటించుకున్నాడు. తీవ్ర గాయాలతో(80 శాతం) హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అర్ధరాత్రి సమయంలో కన్నుమూశాడు. పోస్ట్‌మార్టం అనంతరం శంకర్ గౌడ్ మృతదేహాన్ని స్వస్థలం ముత్తోజీపేట పోలీసులు తరలించారు.

## అందుకే పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు: అమిత్‌షా




నిన్న జరిగిన బెంగాల్ తొలివిడత ఎన్నికల్లో బీజేపీ భారీగా సీట్లు దక్కించుకోబోతుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా జోస్యం చెప్పారు. పోలింగ్ జరిగిన 152 స్థానాల్లో బీజేపీ ఏకంగా 110 సీట్లను సొంతం చేసుకోబోతుందన్నారు. బెంగాల్ ప్రజలు ప్రస్తుత పాలన పట్ల విసిగిపోయారని, రాష్ట్రంలో ఖచ్చితంగా మార్పు కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఓటర్లు ఎనలేని ఉత్సాహంతో, ఆవేశంతో పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారని అందుకే రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదయ్యిందన్నారు. ఇది అధికార పక్షానికి వ్యతిరేకంగా జరిగిన నిశ్శబ్ద విప్లవమని అభిప్రాయపడ్డారు. అయితే నిన్న (గురువారం) ప్రధాని మోదీ సైతం ఈ విధంగానే మాట్లాడారు. బెంగాల్‌లో జరిగిన భారీ ఓటింగ్ ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనమన్నారు. మే 4 తర్వాత బెంగాల్‌లో విజయోత్సవ సభ నిర్వహిస్తామని బెంగాల్ ప్రజలకు ఝాల్‌మురీ, స్వీట్లు పంపిణీ చేస్తానని తెలిపారు. కాగా ఎన్నికల ఫలితాలు రాకముందే ఇంత భారీ స్థాయిలో సీట్లు గెలుచుకుంటామని ప్రకటించడం వెనుక బీజేపీ పక్కా వ్యూహం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ వ్యాఖ్యలతో రాష్ట్రంలోని మిగిలిన విడతల ఎన్నికల ప్రచారం మరింత రసవత్తరంగా మారే అవకాశం ఉంది. కాగా బెంగాల్ తొలివిడత పోలింగ్‌లో రికార్డు స్థాయిలో ఏకంగా 92.72శాతం పోలింగ్ నమోదైన సంగతి తెలిసిందే. కాగా రెండో విడత పోలింగ్ ఏప్రిల్ 29న జరగనుంది.

# కాగ్ నివేదిక దిగ్భ్రాంతికరం




కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) కొద్ది రోజుల క్రితం పార్లమెంటుకు సమర్పించిన నివేదికలోని అంశాలు దిగ్భ్రాంతిగొలుపుతున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరాంతంలో రూపొందించిన ఈ నివేదికలో గత కొన్నేళ్ళుగా వివిధ శాఖల్లో చోటుచేసుకున్న ఆర్థిక అవకతవకలను అంకెలతో సహా కాగ్ వివరించింది. ఆర్థిక అవకతవకలను, నిధుల దుర్వినియోగాన్ని కళ్లకు కట్టినట్టు వివరించిన అత్యంత కీలకమైన ఈ నివేదికకు మోడీ ప్రభుత్వం కనీస ప్రాధాన్యత ఇవ్వలేదు. ఆయనకు ఎల్లవేళలా వంత పాడే కార్పొరేట్ మీడియా సైతం అదే బాట పట్టడం, ఈ నివేదికను దాదాపుగా విస్మరించడం, అరకొర అంశాలతో సరిపెట్టడం ఎన్నో ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఈ నివేదిక ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేసిన దాదాపు 54వేల కోట్ల రూపాయలకు ఎటువంటి లెక్కలూ లేవు. ఆ మొత్తాన్ని ఎందుకోసం ఖర్చు చేశారో తెలియచేసే పత్రాలు కూడా లేవు. 'పదే పదే అడిగినా పథకాల పేర్లు తప్ప ఎటువంటి పత్రాలను అధికారులు ఇవ్వడం లేదు' అని 'అనేక ఆర్థిక లావాదేవీలు అనుమానాస్పదంగా ఉన్నాయి' అని కాగ్ పేర్కొనడం గమనార్హం. నిధుల వినియోగంలో పారదర్శకత కోసం ఖర్చు చేసిన నిధులకు వినియోగ ధృవపత్రం (యుటిలైజేషన్ సర్టిఫికెట్-యుసి) సమర్పించడం తప్పనిసరి. జనరల్ ఫైనాన్షియల్ రూల్స్ -2017లోని 238వ రూల్ ప్రకారం నిధులు ఖర్చు చేసిన 12 నెలల్లోగా దానికి సంబంధించిన ధృవీకరణ పత్రాలను ఖచ్చితంగా సమర్పించి తీరాలి. కానీ, కాగ్ పదే పదే కోరినా ప్రభుత్వ శాఖలు స్పందించకపోవడం దేనికి సంకేతమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కాగ్ నివేదిక ప్రకారం ఇలా యుటిలైజేషన్ సర్టిఫికెట్ సమర్పించని శాఖల్లో కేంద్ర ప్రభుత్వ గృహ నిర్మాణ శాఖ మొదటి స్థానంలో ఉంది. 18,273 కోట్ల రూపాయల మొత్తానికి ఆ శాఖ నుండి యు.సి లు రావాల్సిఉంది. ఆ తరువాత స్థానంలో ఉన్న ఉన్నత విద్యాశాఖ 14,359 కోట్ల రూపాయలకు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించాల్సిఉంది. ఇలా 2025 మార్చి 31 నాటికి 15 కేంద్ర ప్రభుత్వ శాఖల నుండి 33,973 సర్టిఫికెట్లు అందాల్సి ఉందని కాగ్ పేర్కొనడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. నిబంధనల ప్రకారం ఈ ధృవ పత్రాలను సమర్పించని సంస్థలను ఆర్థికశాఖ బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి తీరాలి. ఏళ్ల తరబడి ఆ నిబంధనలు ఎందుకు అమలు కాలేదో, అలా అమలు కాకపోవడం వెనుక ఏ శక్తులు ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఒకవైపు అందుబాటులో ఉన్న నిధులను అవ్యవస్థంగా ఖర్చు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం మరోవైపు సంక్షేమ పథకాలకు కేటాయింపులను తగ్గించడం, రాష్ట్రాలకు ఇవ్వాల్సిన నిధులను కూడా ఇవ్వకపోవడం వంటి చర్యలకు పాల్పడుతుండటం దుర్మార్గం. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక అవకతవకలు వెలుగులోకి రావడం మొదటిసారి కాదు. గతంలోనూ ఇటువంటి అంశాలను కాగ్ వెల్లడించింది. వాటిని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రాజ్యాంగ సంస్థల అవకతవకలను ఎత్తిచూపినా కేంద్రం నిర్లక్ష్యంగానే వ్యవహరించింది. పార్లమెంట్‌లో కనీస చర్చ కూడా జరగనివ్వడం లేదు. కేంద్రం అమలు చేస్తున్న ముఖ్యమైన మూడు పథకాలలో జరిగిన కోట్ల రూపాయల అవకతవకలను ఇటీవల కాగ్ బట్టబయలు చేసింది. ద్వారక ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణంలో మొదట ప్రతి కిలోమీటర్‌కు 18.20 కోట్లుగా ఖర్చు అంచనా వేయగా, అది తరువాత 250.7 కోట్లకు పెరిగింది. సరైన ప్రాజెక్ట్ నివేదిక లేకుండానే ఇంత భారీ ఖర్చు చేయడంపై కాగ్ లేవనెత్తిన సందేహాలకు ఇంతవరకు స్పష్టమైన సమాధానం రాలేదు. గ్రామీణాభివృద్ధి పథకాలలో, ప్రధాన్ మంత్రి జన ఆరోగ్య బీమా పథకం ఇలా చెప్పుకుంటే ఈ జాబితా కొండవీటి చాంతాడంత ఉంది. ఆయుష్మాన్ భారత్ పథకంలో 80,000 మందికి ఒకే ఫోన్ నంబర్ నమోదు చేయడాన్ని కాగ్ ఎత్తి చూపినా పాలకులలో చలనం లేదు. వేల కోట్ల రూపాయల అవకతవకలకు సంబంధించిన తాజా నివేదికకు కూడా అదే గతి పడుతుందన్న అనుమానాలు పరిశీలకుల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ప్రభుత్వం ప్రజలకు జవాబు చెప్పాల్సిందే. దీనికి భిన్నంగా పాలనా వ్యవస్థలన్నింటిని తమ ఆధీనంలో ఉంచుకుని, ఏకపక్షంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతుంది. ఈ ధోరణులను ప్రతిఘటించడం ప్రజాస్వామ్య వాదుల కనీస బాధ్యత!

# డిజిటల్ స్క్రీన్ యుగంలోనూ పుస్తకాలే విజేతలు.. ప్రింట్ చదువు ఎందుకు ప్రత్యేకం?



ప్రింట్ రూపంలోని పుస్తకాలు చదవడం గతకాలపు అవశేషంగా మారుతుందని కొందరు సూచించారు.. అంతేకాకుండా, పుస్తకాలను ఎలక్ట్రానిక్‌గా చదవడం ప్రమాణంగా మారుతుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ అంచనాలు పూర్తిగా తప్పు కావు. కిండిల్స్, కోబోస్ బాగా ప్రాచుర్యం పొందాయి, కానీ ప్రింట్ పుస్తకాలు ఎక్కడికీ వెళ్ళడం లేదు. మీ వేలికొనలకు ఏదైనా డౌన్లోడ్ చేసుకునే ఎంపిక ఉన్నప్పటికీ, ప్రజలు ఇప్పటికీ తమ స్థానిక పుస్తకాల షాపులకు లేదా సెకండ్ హ్యాండ్ దుకాణాలకు వెళ్లి ఒక ముద్రిత నవలను కొనుగోలు చేయడాన్ని ఎంచుకుంటున్నారు. తార్కికంగా, సులభమైన ఎంపికను ఎంచుకోవడం అర్థవంతంగా ఉంటుంది, కాబట్టి గతం వాతావరణంతో కూడిన పేజీల వైపు మనం ఇప్పటికీ ఎందుకు ఆకర్షితులవుతున్నాం?

### మెదళ్లను వెలిగించగలవా?

మీ మెదడు ప్రింట్ పుస్తకాలను స్క్రీన్ల కంటే ఎందుకు ఎక్కువగా ఇష్టపడుతుంది? భౌతిక పుస్తకాలు నిజంగా స్క్రీన్ల కంటే మెదడును ఎక్కువగా నిమగ్నం చేస్తాయా? మనం చదివే పుస్తకాల కంటే మన స్క్రీన్లు చాలా ప్రకాశవంతంగా ఉంటాయి. ఒక బటన్ క్లిక్ చేస్తే అవి మనకు రంగులు, వీడియోలను చూపించగలవు. కానీ అవి మన మెదళ్లను కూడా వెలిగించగలవా?

### ఈ రీడర్‌ను మెదడు పరిగణించదు!

లైట్లు మసకబెట్టి, కొత్త మిస్టరీ నవల మొదటి అధ్యాయాన్ని ప్రారంభిం చడం వలన మీ ఆసక్తి మాత్రమే తీరదు. ఇది మీ మెదడును మాన్హట్టన్ స్కైలైన్ లాగా వెలిగిస్తుంది. మన మెదళ్లు స్పర్శకు, భౌతికంగా ఉనికిలో ఉన్న, మన స్థల జ్ఞాపక శక్తిని నిమగ్నం చేసే వస్తువులకు ఆకర్షితులవుతాయి. కాగితాన్ని అనుభూతి చెందడం, పేజీని తిప్పడం, మనం చదువుతున్న పదాల గురించి ఆలోచించడం మధ్య ఉన్న ఆ సంబంధం చాలా ముఖ్యమైనది. వాటిని స్క్రీన్‌పై చదివినప్పుడు కంటే చాలా లోతైన జ్ఞాపకశక్తిని పెంపొందిస్తాయి. మన మెదళ్ళు ఈ-రీడర్లను తాత్కాలికంగా పరిగణిస్తాయి.

### ప్రింట్ పుస్తకాలను ఇష్టపడతారా?


యువతీ యువకులు ప్రింట్ పుస్తకాల పట్ల ఆకర్షణను పంచుకుంటున్నారు. 2019లో, ఒక అధ్యయనం ప్రకారం 18-29 సంవ త్సరాల వయస్సు గల వారిలో 74% మంది ఇప్పటికీ ఈ-బుక్స్ కంటే ప్రింట్ పుస్తకాలను ఇష్టపడతారు.. పైగా చదవడానికి సంబంధించిన సాంప్రదాయ రూపాలు మన మెదడులోని చాలా ఎక్కువ ప్రాంతాలను వెలిగిస్తాయి. ఆల్డస్ హక్స్లీ రాసిన డిస్టో పియన్ నవల బ్రేవ్ న్యూ వరల్డ్ ఒక భవిష్యత్ ప్రపంచాన్ని వివ రిస్తుంది, ఇక్కడ నివాసితులు ఎల్లప్పుడూ కృత్రిమమైన ఆనందంలో, సంతోషంలో ఉంటారు. ప్రజలు ఈ ఆనంద భావన కోసమే జీవిస్తారు. దానికి ప్రతిఫలంగా, వారు గాఢమైన చింతన క్షణాలను అరుదుగా అనుభవిస్తారు. ఈ 'బ్రేవ్ న్యూ వరల్డ్'లోని ప్రజలు ఉపరితలంగా జీవితాన్ని గడుపుతున్నారు, కానీ, హక్స్‌లీ ఎప్పటికీ ఈ-బుక్స్‌ని ఖండించి ఉండేవాడు కాదు.

### ప్రపంచం కొత్తగా ఉండొచ్చు కానీ..

అవి చదవడం, విమర్శనాత్మక ప్రతిబింబానికి చెందిన ఒక రూపమే, కానీ సాంకేతిక పురోగతి గొప్పది కాదని అతను మనల్ని హెచ్చరించి ఉండవచ్చు.. పురోగతి పేరుతో మనం ఏమి వదులుకోవడానికి సిద్ధంగా ఉన్నాం అని అడిగి ఉండవచ్చు. భౌతిక పుస్తకాలు చాలా సంవత్సరాలుగా ఉనికిలో ఉన్నాయి, మట్టి పలకల నుండి ముద్రిత పేజీల వరకు పరిణామం చెందుతూ, చక్రవర్తులు, ప్రభువుల అల్మారాలలో వరుసలో ఉండేవి. ఇప్పుడు మీ స్వంత ఇంట్లో కూడా ఉన్నాయి. మన ప్రపంచం కొంత కొత్తగా ఉండవచ్చు, కానీ మనం పాతదాని విలువను మరచిపోలేదు.. మన స్క్రీన్ల కాంతి అందంగా ఉండవచ్చు, కానీ దాన్ని ఎప్పటికీ ప్రకాశించే, సక్రియం చేయబడిన మనస్సుకు చెందిన తిరుగులేని అందంతో పోల్చలేము.

# వేసవి.. అపోహలకు దూరంగా ఉందాం!

నేడు భూగోళం వేడెక్కుతోంది. వాతావరణ మార్పుల ప్రభావం మన ముంగిట నిప్పుల కొలిమిలా మారింది. గడిచిన కొన్నేళ్లుగా మార్చి నెల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండటం ఆందోళనకరం. విచ్చలవిడిగా చెట్ల నరికివేత, కాంక్రీట్ భవనాల నిర్మాణం, పెరుగుతున్న వాహన కాలుష్యం వెరసి నగరాలు 'హీట్ ఐలాండ్స్'గా మారుతున్నాయి.. ఈ నేపథ్యంలో ప్రజల్లో అవగాహన పెంచడానికి సోషల్ మీడియా వేదికగా వస్తున్న సమాచారం ఒకవైపు ఉపయోగపడుతున్నప్పటికీ, మరోవైపు శాస్త్రీయత లేని 'అత్యవసర హెచ్చరికలు' అనవసర భయాందోళనలను రేకెత్తిస్తున్నాయి. ఈ వేసవిని సురక్షితంగా ఎదుర్కోవాలంటే మనకు కావాల్సింది భయం కాదు, బాధ్యతాయుతమైన అప్రమత్తత.




### శాస్త్రీయత లేని వాదనలు..

ప్రస్తుతం వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి వేదికల్లో కొన్ని సందేశాలు విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి.. వీటిని లోతుగా విశ్లేషిస్తే అందులో వాస్తవాల కంటే అతిశయోక్తులే ఎక్కువగా కనిపిస్తాయి.. ఉదాహరణకు, ఉష్ణోగ్రతలు 50లీజ నుండి 55లీజ వరకు పెరుగుతాయనే ప్రచారం అన్ని ప్రాంతాలకు వర్తించదు. రాజస్థాన్ వంటి ఎడారి ప్రాంతాల్లో లేదా కొన్ని నిర్దిష్ట పారిశ్రామిక ప్రాంతాల్లో ఇవి నమోదయ్యే అవకాశం ఉన్నప్పటికీ, సాధారణ జనావాసాల్లో ఇంతటి తీవ్రత అరుదు. అందుకే ప్రచారాలను నమ్మొద్దు. భారత వాతావరణ శాఖ బులిటెన్‌లను మాత్రమే మనం ప్రామాణికంగా తీసు కోవాలి. అలాగే ఎండ తీవ్రతకు ఫోన్లు పేలడం లేదా వాహనాల ట్యాంకులు పేలడం వంటివి సామాన్యంగా జరగవు.. తక్కువ నాణ్యత గల బ్యాటరీల వల్ల లేదా సాంకేతిక లోపాల వల్ల ప్రమాదాలు జరగవచ్చు కానీ, కేవలం వాతావరణ వేడి వల్లే ఇవి సంభవిస్తాయనడం అపోహ మాత్రమే.. అదే విధంగా అల్ట్రావయొలెట్ (ఖఎ) కిరణాల శాతం గురించి వచ్చే అంకెలలో కూడా శాస్త్రీయత లోపించింది. ఓజోన్ పొర మనల్ని రక్షిస్తూనే ఉంది, అయితే సుదీర్ఘకాలం ఎండలో ఉండటం వల్ల చర్మ సమస్యలు రావచ్చునేది వాస్తవం.

### వ్యక్తిగత రక్షణ కోసం..

ఇక వేసవి తీవ్రత నుంచి తప్పించుకోవడానికి కేవలం నీళ్లు తాగడం మాత్రమే సరిపోదు, ఒక క్రమ శిక్షణతో కూడిన జీవనశైలి అవసరం. శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఉండాలంటే దాహం వేసే వరకు ఆగకుండా గంటకోసారి నీరు తాగాలి. ఓఆర్ఎస్ (ాా), మజ్జిగ, కొబ్బరినీళ్లు, గ్లూకోజ్ నీరు వంటివి సేవించాలి. ఇవి శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడతాయి. వేసవిలో జీర్ణక్రియ మందగిస్తుంది కాబట్టి తేలికపాటి ఆహారం తీసుకోవాలి. ప్రోటీన్ ఎక్కువగా ఉండే మాంసాహారం, మసాలాలు, వేపుళ్లు తగ్గించడం ఉత్తమం. కాఫీ, టీ, ఆల్కహాల్ శరీరంలోని నీటిని త్వరగా బయటకు పంపి డీహైడ్రేషన్ ముప్పును పెంచుతాయి. వీటికి బదులుగా మట్టి కుండలో నీరు, పుచ్చకాయ, దోసకాయ వంటి ప్రకృతి సిద్ధమైన పండ్లను ఆశ్ర యించాలి. వ్యక్తిగత రక్షణ కోసం ప్రయాణ సమయాల్లో మార్పులు చేసుకోవడం తప్పనిసరి. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల మధ్య ప్రయాణాలను వీలైనంత వరకు వాయిదా వేసుకోవాలి. ముఖ్యంగా గర్భిణీలు, చిన్నపిల్లలు, వృద్ధులు.. ఈ సమయంలో బయటకు రాకపోవడమే శ్రేయస్కరం.


### ఈ వైరస్ ప్రమాదకరం!

బయటకు వెళ్లాల్సి వస్తే లేత రంగులో ఉండే కాటన్ దుస్తులు ధరించాలి. ఇవి గాలిని లోపలికి పంపి శరీరాన్ని చల్లగా ఉంచుతాయి.. తల కప్పుకోవడానికి గొడుగు లేదా టోపీ, కళ్ల రక్షణకు నాణ్యమైన సన్ గ్లాసెస్ వాడటం మంచిది. ఒకవేళ వడదెబ్బ తగిలిన లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రథమ చికిత్స చేయించుకోవాలి. మనం చల్లగా ఉండటానికి ప్రయత్ని స్తున్నట్టే మనమీద ఆధారపడి ఉండే మూగ జీవాల పట్ల కూడా కారుణ్యం చూపాలి. పక్షులు, జంతువుల కోసం ఇంటి మేడ మీద లేదా బయట చిన్న పాత్రల్లో నీటిని ఉంచాలి.. అటవీ ప్రాంతాల్లో నీరు దొరకక కొన్ని జంతువులు జన ఆవాసాల్లోకి వచ్చే అవకాశం ఉంది. అటువంటి సమయంలో భయాం దోళన చెందకుండా అటవీ శాఖకు సమాచారం అందించాలి. ఇక సమాచార విస్ఫోటనం జరుగుతున్న ఈ రోజుల్లో నిజా నిజాలను నిర్ధారించుకోవడం ఒక సామాజిక బాధ్యత. ప్రభుత్వం, వాతావరణ శాఖ ఇచ్చే అధికారిక సూచనలను మాత్రమే అనుసరించాలి. భయపెట్టే సందేశాలను ఫార్వార్డ్ చేయడం కంటే, శాస్త్రీయమైన జాగ్రత్తలను పంచుకోవడం ద్వారా సమాజాన్ని రక్షించవచ్చు. ప్రకృతి వైపరీత్యం కంటే మానవ నిర్మితమైన 'అపోహల వైరస్' ఎప్పుడూ ప్రమాదకరమైనదే. మెరుగైన అవగాహనతో, అప్రమత్తమైన జీవనశైలితో ఈ వేసవిని సురక్షితంగా ఎదుర్కుందాం.

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక



# గ్లామర్ డోస్ పెంచేసిన కృతి సనన్.. బ్లాక్ అవుట్ ఫిట్ లో మరింత హీట్ పెంచుతూ!



అసలే సమ్మర్.. సూర్య భగవానుడి భగభగ మంటలకు ప్రజలు అల్లాడిపోతుంటే .. హీరోయిన్లు కూడా ఆ వేడిని మరింత పెంచడానికి సెగలు పుట్టించేలా ఔట్ ఫిట్స్ ధరిస్తూ సోషల్ మీడియా వేదికగా అందాలు ఆరబోస్తున్నారు. ఒకరు కాదు ఇద్దరు కాదు.. ఒకరి తర్వాత ఒకరు.. ఒకరితో ఒకరు పోటీపడుతూ గ్లామర్ విందు వడ్డిస్తూ అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు . ఇక సోషల్ మీడియా వాడకం ఎప్పుడైతే పెరిగిపోయిందో అటు చిన్న పిల్లల్ని మొదలుకొని పెద్దవాళ్ల వరకు ప్రతి ఒక్కరు మొబైల్ ఫోన్ లేనిదే గడవని రోజులు . అలాంటి ఈ సమయంలో హీరోయిన్స్ కూడా తమ అందాలను ఎరగా వేసి క్యాష్ చేసుకుంటున్నారు అనే వార్తలు ఎప్పటికప్పుడు వ్యక్తం అవుతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే అలా అందాలతో మరింత హీట్ పెంచుతూ బ్లాక్ అవుట్ ఫిట్ లో సెగలు పుట్టించే ప్రయత్నం చేసింది కృతి సనన్. విభిన్నమైన ఫోజులు ఇస్తూ సెగలు పుట్టించేలా ఫోటోలకు పంచుకుంది. బ్లాక్ అవుట్ ఫిట్ లో కృతి షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. లెదర్ మెటీరియల్ ను తలపించేలా బ్లాక్ డ్రెస్ ధరించిన ఈమె తన అవుట్ ఫిట్ ను మరింత అందంగా మార్చుకుంది. హుందాగా ఫోటోలకు ఫోజులిస్తూ మెస్మరైజ్ చేసింది. మరికొన్ని ఫోటోలలో రొమాంటిక్ గా ఫోజులిస్తూ నెటిజన్స్ ను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. అలా మొత్తానికైతే కృతి తాజాగా షేర్ చేసిన ఈ లేటెస్ట్ ఫోటోషూట్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. ఇండస్ట్రీలోకి రాకముందు పెద్ద పెద్ద కంపెనీల కమర్షియల్ యాడ్స్ లలో నటించిన ఈమె.. తొలిసారి తెలుగులో మహేష్ బాబు హీరోగా వచ్చిన 1: నేనొక్కడినే అనే సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసింది. ప్రముఖ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను 14 రీల్స్ ఎంటర్టైన్మెంట్ పతాకంపై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మించారు. దేవిశ్రీప్రసాద్ సంగీతాన్ని అందించారు. ఇక ఈ సినిమాతో తెలుగు ప్రేక్షకులను తన అందం , హైట్ తో అందర్నీ ఆకట్టుకున్న కృతి సనన్.. హిందీలో జాకీ ష్రాఫ్ వారసుడు టైగర్ ష్రాఫ్ తో హీరోపంతి సినిమాలో నటించి హిందీ రంగ ప్రవేశం చేసిం.ది ఇక తర్వాత ఆది పురుష్ సినిమాలో సీత పాత్ర పోషించి.. ఇటు తెలుగు ప్రేక్షకులను మరోసారి పలకరించింది కృతి సనన్. హిందీలోనే సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈమె తాజాగా కాక్ టెయిల్ 2 సినిమాలో నటిస్తోంది. రష్మిక మందన్నతో కలిసి నటిస్తోంది. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా అందం, అభినయంతో ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేస్తుంది ఈ చిన్నది.. మరి ఈ సినిమాతో బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తుందో చూడాలి.




# ధురంధర్ తర్వాత రామాయణ.. మరి వారణాసి



బాలీవుడ్ లో రెండు పార్టుల సినిమాల ట్రెండ్ మళ్లీ ఊపందుకుంటోంది. రీసెంట్ గా విడుదలైన ధురంధర్ సినిమా రెండు పార్టులుగా వచ్చి బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది.

బాలీవుడ్ లో రెండు పార్టుల సినిమాల ట్రెండ్ మళ్లీ ఊపందుకుంటోంది. రీసెంట్ గా విడుదలైన ధురంధర్ సినిమా రెండు పార్టులుగా వచ్చి బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ఆ మూవీ రెండు భాగాలు కూడా ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు కలెక్షన్ల పరంగా కూడా రికార్డులు సృష్టించాయి. దీంతో పెద్ద కథలను రెండు భాగాలుగా తెరకెక్కించే ట్రెండ్ మళ్లీ చర్చనీయాంశంగా మారింది. ఇక ఇప్పుడు అందరి దృష్టి బాలీవుడ్ లో తెరకెక్కుతున్న భారీ పౌరాణిక చిత్రం రామాయణపై పడింది. దర్శకుడు నితేశ్ తివారీ రూపొందిస్తున్న ఆ మూవీ ఇప్పటికే రెండు భాగాలుగా రానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. మొదటి భాగాన్ని 2026 దీపావళికి, రెండో భాగాన్ని 2027 దీపావళికి విడుదల చేయాలని ప్లాన్ చేశారు. ఇటీవల విడుదలైన గ్లింప్స్ ద్వారా ఆ విషయాన్ని మరోసారి స్పష్టం చేశారు. చాశ్రీంశీ =ముఃు - కథలపై బాలయ్య ఫోకస్ మారిందా? చాఃజవతీఅంవఎవత్ భారీ బడ్జెట్, అద్భుతమైన విజువల్స్ తో ఆ చిత్రం తెరకెక్కుతున్న నేపథ్యంలో, రెండు భాగాలుగా విడుదల చేయడం సరైన నిర్ణయమని అంతా అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో మరో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. అదే వారణాసి సినిమా గురించి. టైమ్ ట్రావెల్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఆ ప్రాజెక్ట్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా ఇందులో రామాయణానికి సంబంధించిన ఎపిసోడ్ కూడా ఉండటం ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. అయితే ఆ సినిమాను కూడా రెండు భాగాలుగా విడుదల చేస్తారా లేదా అనేది ఇంకా క్లారిటీ లేదు. తెలుగు సినీ పరిశ్రమలో సీక్వెల్ ట్రెండ్ ను పాపులర్ చేసిన వ్యక్తి రాజమౌళి. ఆయన తెరకెక్కించిన బాహుబలి సినిమాను రెండు భాగాలుగా విడుదల చేసి సంచలనం సృష్టించారు.- యూనిక్ లుక్: -రామాయణం- కోసం రణబీర్ భారీ ప్రయోగం! ఆ తర్వాత నుంచి పెద్ద కథలు రెండు పార్టులుగా చెప్పే ధోరణి బలపడింది. అయితే రాజమౌళి తన ప్రతి సినిమాను రెండు భాగాలుగా తీస్తారని మాత్రం కాదు. ఉదాహరణకు ఆయన తీసిన ఆర్ఆర్ఆర్ ఒకే భాగంగా విడుదలై ప్రపంచవ్యాప్తంగా ఘన విజయం సాధించింది. వారణాసి సినిమాపై కూడా ఇదే ప్రశ్న ఎదురవుతుంది. ఆ మూవీని రెండు పార్టులుగా తెరకెక్కించే ఆలోచన ఉందా లేదా అనే దానిపై ఇప్పటివరకు స్పష్టత లేదు. గతంలో రాజమౌళి ఆ ప్రాజెక్ట్ ను రెండు భాగాలుగా తీసే ఆలోచన లేదని సంకేతాలు ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. అయితే కథ, విజువల్ స్కేల్ ను బట్టి ఫైనల్ గా ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి. మొత్తానికి, ధురంధర్ విజయంతో ప్రారంభమైన ఆ చర్చ రామాయణతో మరింత బలపడింది. ఇప్పుడు అందరి చూపు వారణాసిపై ఉంది. అది కూడా రెండు భాగాలుగా వస్తుందా? లేక ఒకే భాగంగా ప్రేక్షకుల ముందుకు వస్తుందా? అన్నది తెలుసుకోవాలంటే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

# టాలీవుడ్ హీరోయిన్ల రెమ్యూనరేషన్లపై ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది



గతంలో ఒకటి లేదా రెండు చిత్రాలతో మంచి గుర్తింపు పొందిన కొందరు హీరోయిన్లు.. ప్రస్తుతం అవకాశాల కోసం ఎదురుచూస్తున్నప్పటికీ, పెద్దగా సినిమాల్లో కనిపించడం లేదు. అయితే సోషల్ మీడియాలో మాత్రం వీరి హీట్ పుట్టించే ఫోటోలు, గ్లామర్ పోస్టులు తరచుగా కనిపిస్తూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీరి కెరీర్ గ్రాఫ్ పై, అలాగే పారితోషికాలపై ఇప్పుడు చర్చ నడుస్తోంది. అయితే గతంలో ఒకటి రెండు హిట్లు సాధించిన కొంతమంది హీరోయిన్లు, నిర్మాతలు సంప్రదించినప్పుడు ఒక్క సినిమాకు కోటి రూపాయలకు పైగా డిమాండ్ చేస్తున్నారట. అయితే ప్రస్తుతం మార్కెట్ పరిస్థితి మారిపోవడంతో, నిర్మాతలు అంత భారీ మొత్తాలు చెల్లించడానికి వెనుకంజ వేస్తున్నారు. దీంతో వారికి కొత్త అవకాశాలు తగ్గుతున్నాయని తెలుస్తోంది. డైలమాలో స్టార్ డైరెక్టర్లు.. నిజానికి ఒక హీరోయిన్ కు మార్కెట్ ఉండాలంటే వరుసగా సినిమా అవకాశాలు రావడం చాలా ముఖ్యం. కానీ ఎక్కువ పారితోషికం ఆశిస్తూ అవకాశాలను వదులుకుంటే, తర్వాత అవకాశాలు దొరకని పరిస్థితి వస్తుందని చెప్పాలి. ఈ నేపథ్యంలో కొంత మంది నిర్మాతలు తక్కువ బడ్జెట్ సినిమాలపై దృష్టి పెట్టడంతో, హీరోయిన్లకు ఇచ్చే రెమ్యునరేషన్ కూడా గణనీయంగా తగ్గించాలనే ఆలోచనలో ఉన్నారట. మరోవైపు ప్రస్తుతం ఓటీటీ ప్లాట్ ఫామ్స్ నుంచి వచ్చే ఆదాయం కూడా గతంతో పోలిస్తే తగ్గినట్లు సమాచారం. థియేటర్లలో కూడా కలెక్షన్లు ఆశించినంతగా రాకపోవడంతో, నిర్మాతలు ఖర్చు తగ్గించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ ప్రభావం మొదటగా హీరోయిన్ల పారితోషికాలపై పడుతుందని వినికిడి. ఇప్పటికే కొంతమంది నిర్మాతలు ఒక్కో హీరోయిన్ కు 8 నుంచి 15 లక్షల మధ్యే పారితోషికం ఇవ్వాలని భావిస్తున్నారట. ఆ నటుడిని ఆకాశానికి ఎత్తేసిన పాకిస్తానీ వైఫ్! ఈ నేపథ్యంలో కొత్తగా వస్తున్న హీరోయిన్ల కు అవకాశాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా మరాఠీ, కన్నడ వంటి ఇతర భాషల నుంచి వచ్చిన కొత్త వాళ్ళు తక్కువ పారితోషికంతో వరుసగా అవకాశాలు దక్కించుకుంటున్నారు. దీంతో వారు ఒకేసారి మూడు నుంచి నాలుగు సినిమాల్లో నటిస్తూ బిజీగా మారుతున్నారు. అయితే కొన్ని సందర్భాల్లో, ఓ హీరో లేదా నిర్మాత అత్యవసర పరిస్థితుల్లో ఎక్కువ పారితోషికం ఇచ్చి హీరోయిన్ ను తీసుకుంటారని, కానీ అది తాత్కాలికమేనని చెప్పాలి. సందీప్‌రెడ్డి వంగని ఆకాశానికి ఎత్తేస్తున్న నిర్మాత! అలాంటి ఒకటి రెండు అవకాశాలు వచ్చినా, అదే పరిస్థితి మళ్లీ రిపీట్ అవ్వొచ్చు. మొత్తానికి ప్రస్తుతం తెలుగు సినీ పరిశ్రమలో ఖర్చులను నియంత్రించే దిశగా మార్పులు జరుగుతున్నాయి. ఆ మార్పుల్లో భాగంగా హీరోయిన్ల పారితోషికాలు కూడా తగ్గే అవకాశం ఉందని స్పష్టమవుతోంది. భవిష్యత్తులో మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా తమ డిమాండ్లను మార్చుకుంటేనే హీరోయిన్లు వరుస అవకాశాలు అందిపుచ్చుకునే అవకాశముంది. మరేం జరుగుతుందో చూడాలి

# ప్రదీప్ రంగనాథన్‌కు 50 కోట్లా



వరుసగా మూడు వంద కోట్ల సినిమాలు అందించిన హీరోతో సినిమా చేయడానికి నిర్మాతలు ఎగబడడంలో ఆశ్చర్యమేమీ లేదు. వరుసగా మూడు వంద కోట్ల సినిమాలు అందించిన హీరోతో సినిమా చేయడానికి నిర్మాతలు ఎగబడడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఆ హీరోను లాక్ చేయడం కోసం మార్కెట్ స్థాయిని మించి, కొంచెం ఎక్కువ పారితోషకం ఇవ్వడానికి కూడా ప్రయత్నిస్తారు. అలా అని ఆ హీరో మీద పెట్టగలిగే గరిష్ట బడ్జెట్ మొత్తాన్ని కేవలం పారితోషకం రూపంలో ఇస్తారంటే వినడానికి విడ్డూరంగా అనిపించక మానదు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ.. తమిళ కథానాయకుడు ప్రదీప్ రంగనాథన్‌కు ఏకంగా రూ.50 కోట్లు పారితోషకంగా ఇవ్వబోతోందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం ఇలాగే ఇప్పుడు అందరికీ కామెడీగా తోస్తోంది. ప్రదీప్ ఇప్పటికే మైత్రీ సంస్థలో 'డ్యూడ్' మూవీ చేశాడు. ఆ సినిమా వంద కోట్ల వసూళ్లు రాబట్టింది. కానీ షేర్ రూ.50 కోట్ల లోపే వచ్చింది. సినిమాకు రూ.50 కోట్ల పైగానే ఖర్చయింది. ఆ చిత్రానికి ప్రదీప్ రంగనాథన్ రూ.15 కోట్ల మేర పారితోషకం అందుకున్నాడు. చాశ్రీంశీ =ముఃు - కథలపై బాలయ్య ఫోకస్ మారిందా? చాఃజవతీఅంవఎవత్ అలాంటిది ఇప్పుడు దాని మీద మూడు రెట్ల పారితోషకంతో అతను మైత్రి సంస్థలో సినిమా చేయబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. స్క్రీన్ ప్లే మాస్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్న టాలీవుడ్ సీనియర్ దర్శకుడు చంద్రశేఖర్ యేలేటి.. ప్రదీప్ హీరోగా మైతీ సంస్థలో సినిమా చేయడానికి అంగీకారం కుదిరింది. తనకు తమిళంలో విపరీతమైన డిమాండ్ ఉన్నప్పటికీ.. మరోసారి తెలుగు బేనర్లో, పైగా తెలుగు దర్శకుడితో సినిమా చేయడానికి ప్రదీప్ ఒప్పుకోవడం విశేషమే. ఈ చిత్రానికి 'డ్యూడ్' కంటే ఎక్కువ పారితోషకం తీసుకుంటే ఆశ్చర్యమేమీ లేదు. మహా అయితే రూ.20-25 కోట్ల మధ్య రెమ్యూనరేషన్ తీసుకుంటాడేమో-రామాయణం- కోసం రణబీర్ భారీ ప్రయోగం! కానీ ఏకంగా రూ.50 కోట్లు అని తమిళ మీడియా జనాలు రిపోర్ట్ చేస్తుండడమే విడ్డూరం. పేరున్న తమిళ పీఆర్, క్రిటిక్ హ్యాండిల్స్ అన్నీ ప్రదీప్ రెమ్యూనరేషన్ గురించి టెంప్లేట్ ట్వీట్లు వేసేస్తున్నాయి. తమిళ హీరో కోసం తెలుగు నిర్మాతలు వెంపర్లాడుతున్నారనే ఫీలింగ్ తెప్పించడానికే ఈ పని చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. కానీ వాస్తవం ఏంటంటే.. తమిళంలో దర్శకులు, నిర్మాతల పనితనం తగ్గిపోవడంతో అక్కడి హీరోలు తెలుగు డైరెక్టర్లు, నిర్మాతల వైపు చూస్తున్న మాట వాస్తవం. ఇది గుర్తించకుండా పారితోషకం గురించి ఇలా ఫేక్

# టాప్ లేపుతున్న 'చిరుత' పిల్ల.. నేహా శర్మ గ్లామర్ విందు!



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన -చిరుత- చిత్రంతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చి తెలుగు ప్రేక్షకుల మనసు దోచుకున్న భామ నేహా శర్మ. ప్రస్తుతం ఈ -చిరుత- పిల్ల సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. తాజాగా ప్రసిద్ధ ఫ్యాషన్ మ్యాగజైన్ -గ్రాజియా- కవర్ పేజీ కోసం శర్మా గాళ్ చేసిన ఫోటోషూట్ నెట్టింట మంటలు పుట్టిస్తోంది. బ్లాక్ థీమ్డ్ డిజైనర్ డ్రెస్సులో నేహా తన అందచందాలను ఆరబోస్తూ ఇంటర్నెట్ షేక్ చేస్తోంది. ఈ కవ్విస్తున్న తీరు చూస్తుంటే శర్మ గాళ్ గ్లామర్ డోస్ గతంలో కంటే ఇప్పుడు పీక్స్‌కు చేరుకుందని అర్థమవుతోంది. చీవ×ఘ్ఖుం చాశ్రీంశీ =ముఃు - హీరోయిన్ ఆస్తి 74 కోట్లు - భర్త ఆస్తి కేవలం 50 లక్షలు! చాఃజవతీఅంవఎవత్ నేహా శర్మ తన సోషల్ మీడియా ఖాతాల్లో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ అభిమానులకు టచ్‌లో ఉంటుంది. అయితే ఇటీవలి కాలంలో వరుస ఫోటోషూట్లతో విపరీతంగా చెలరేగిపోతోంది. ముఖ్యంగా బ్యాక్‌లెస్ ఫోటోలు, చిట్టి పొట్టి నిక్కర్లు, బికినీ వీడియోలతో కుర్రకారుకు నిద్ర లేకుండా చేస్తోంది. గ్రాజియా కవర్ పేజీపై ఆమె కనబరిచిన ముగ్ధమనోహర రూపం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఫోటోషూట్‌లో నేహా ఎంతో ఆత్మవిశ్వాసంతో, మునుపెన్నడూ లేని విధంగా తన బోల్డ్ లుక్స్‌తో కట్టిపడేస్తోంది. డైలమాలో స్టార్ డైరెక్టర్లు.. తాజా గ్రాజియా ఫోటోషూట్ కోసం నేహా శర్మ ఎంచుకున్న బ్లాక్ అవుట్‌ఫిట్ ఆమె అందాన్ని మరింత రెట్టింపు చేసింది. మేకప్ ఆర్టిస్ట్ ప్రియాంక చౌరాసియా.. హెయిర్ స్టైలిస్ట్ కింబర్లీ చు ఆమెను దేవకన్యలా తీర్చిదిద్దగా.. ఫోటోగ్రాఫర్ ఇషాన్ జాకా తన కెమెరాలో ఆ అందాలను అద్భుతంగా బంధించారు. ఈ ఫోటోలు చూసిన నెటిజన్లు నేహా శర్మ అసలు అదుపు తప్పింది! అంటూ క్రేజీ కామెంట్లతో సోషల్ మీడియాను హోరెత్తిస్తున్నారు. చిరుత బ్యూటీ అందం -అభినయం రెండూ ఈ ఫోటోషూట్‌లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. చాశ్రీంశీ =ముఃు - ఆ నటుడిని ఆకాశానికి ఎత్తేసిన పాకిస్తానీ వైఫ్! ఇక నేహా శర్మ కెరీర్ విషయానికి వస్తే.. 2026లో కొన్ని ముఖ్యమైన ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ఇప్పటికే డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌పై ఇల్లీగల్, 36 డేస్ వంటి వెబ్ సిరీస్‌లతో తన సత్తా చాటిన నేహా.. 2026లో మరిన్ని భారీ ప్రాజెక్టులతో అలరించే వీలుందని తెలుస్తోంది. ముఖ్యంగా పంజాబీలో జస్సీ గిల్‌తో కలిసి సంజోగ్ అనే చిత్రంలో నటిస్తోంది. హిందీలో కూడా కొన్ని ప్రతిష్టాత్మక చిత్రాలతో పాటు.. ఓటీటీలో మరిన్ని క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్‌లు చేయడానికి సిద్ధమవుతోంది. సినిమాలతో పాటు వెబ్ సిరీస్‌లలో కూడా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవాలని నేహా భావిస్తోంది. వైవిధ్యమైన పాత్రలు చేస్తూనే.. గ్లామర్ పరంగా తన ఫ్యాన్ బేస్‌ను మరింత పెంచుకుంటోంది. ఏది ఏమైనా తన గ్లామరస్ పోస్టులు, అద్భుతమైన నటనతో నేహా శర్మ 2026లో కూడా ట్రెండింగ్ సెల్బ్రిటీగా కొనసాగుతుందనడంలో సందేహం లేదు.

# గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌పై శ్రీలీల..

**శ్రీలీల ఎదుగుదల అందరికీ ఒక రాకెట్ దూకుడులా అనిపించవచ్చు, కానీ ఆమె దృష్టిలో ఇది చిన్న చిన్న అడుగులతో మొదలైన ప్రయాణం.**




టాలీవుడ్ సెన్సేషన్ శ్రీలీల ఇప్పుడు కేవలం సౌత్ ఇండియాకే పరిమితం కాకుండా నేషనల్ లెవల్లో మెరిసిపోతోంది. 'హార్పర్స్ బజార్ ఇండియా' డిజిటల్ కవర్ స్టార్‌గా నిలిచిన ఈ బ్యూటీ, స్టార్ హీరోయిన్‌గా ఇండస్ట్రీ లో తనదైన ముద్ర వేస్తోంది. గ్లామర్ కంటే నిజాయితీతో కూడిన నటనకే తాను ప్రాధాన్యత ఇస్తానని చెబుతున్న శ్రీలీల.. మన ఊరి కథలే ప్రపంచాన్ని మెప్పిస్తాయని నమ్ముతోంది. తాజాగా ఆమె పంచుకున్న తన సినీ ప్రయాణం మరియు భవిష్యత్తు ఆలోచనలు ఇవే..చాశ్రీంశీ =ముఃు - హీరోయిన్ ఆస్తి 74 కోట్లు - భర్త ఆస్తి కేవలం 50 లక్షలు!చాఃజవతీఅంవఎవత్ స్టార్‌డమ్ వెనుక నిశ్శబ్ద ప్రయాణం: శ్రీలీల ఎదుగుదల అందరికీ ఒక రాకెట్ దూకుడులా అనిపించవచ్చు, కానీ ఆమె దృష్టిలో ఇది చిన్న చిన్న అడుగులతో మొదలైన ప్రయాణం. "ఇది ఒక్కసారిగా వచ్చిన గుర్తింపు కాదు, నిశ్శబ్దంగా వేసిన అడుగులు ఇప్పుడు అందరికీ కనిపిస్తున్నాయి" అని ఆమె అంటోంది. ప్రతిరోజూ కొత్త విషయాలు నేర్చుకుంటూ, పాతవి వదిలేస్తూ తనను తాను మల్చుకుంటున్నానని తెలిపింది. ఎంత ఎత్తుకు ఎదిగినా తన మూలాలను మర్చిపోకుండా, సామాన్యంగా ఉండటమే తన విజయరహస్యమని ఆమె తెలిపింది.

**- డైలమాలో స్టార్ డైరెక్టర్లు..**

పుష్ప 2' నుంచి బాలీవుడ్ ఎంట్రీ వరకు: శ్రీలీల కెరీర్ ఇప్పుడు పీక్ లో ఉంది. 'పుష్ప 2' లో తన ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్‌తో అందరినీ ఆకట్టుకోవడమే కాకుండా, తరువాత వచ్చిన 'గుంటూరు కారం'లో కీలక పాత్ర పోషించి మెప్పించింది. ఇక తాజాగా ఈ ఉగాది కి ఉస్తాద్ భగత్ సింగ్ తో అలరించింది. ఇప్పుడు అనురాగ్ బసు దర్శకత్వంలో కార్తీక్ ఆర్యన్ సరసన బాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమైంది. ప్రాంతీయ సరిహద్దులు చెరిగిపోతున్న ఈ సమయంలో, విభిన్న పాత్రల్లో జీవించడం తనకెంతో ఇష్టమని ఆమె అంటోంది. రకరకాల లెన్స్‌ల ద్వారా ప్రపంచాన్ని చూడటం తన ప్రయాణానికి దిక్సూచిగా మారిందని వివరించింది. ఆ నటుడిని ఆకాశానికి ఎత్తేసిన పాకిస్తానీ వైఫ్! మన మూలాలే మన బలం: భారతీయ సినిమా తర్వాతి దశ గురించి శ్రీలీల ఆసక్తికరమైన విషయాలు చెప్పింది. "మన కథలు ఎంత లోకల్‌గా, మన మూలాలకు దగ్గరగా ఉంటే.. అవి అంత గ్లోబల్‌గా ప్రజలకు చేరువవుతాయి" అని ఆమె బలంగా నమ్ముతోంది. మన చిన్న పట్టణాల్లోని కథలు, మన సంస్కృతి, మన గుర్తింపును ప్రపంచ ప్లాట్‌ఫామ్‌పై ఎక్కడా తగ్గకుండా చూపించాలని ఆమె ఆశిస్తోంది. కథలను సింప్లిఫై చేయకుండా, వాటి ఒరిజినల్ కాపాడుతూనే ప్రపంచాన్ని గెలవవచ్చని శ్రీలీల అభిప్రాయపడింది. చాశ్రీంశీ =ముఃు - హీరోయిన్ల రెమ్యూనరేషన్లు తగ్గుతున్నాయా కారణమేంటి వైద్య విద్యార్థి నుంచి గ్లోబల్ స్టార్ వరకు: ఒకవైపు డాక్టర్ విద్యను పూర్తి చేసి, మరోవైపు థియేటర్లను ఊపేసే హీరోయిన్ గా , ఈ రెండు భిన్నమైన పాత్రలను శ్రీలీల బ్యాలెన్స్ చేస్తున్న తీరు అద్భుతం. స్టార్‌డమ్ తలకెక్కించుకోకుండా, నిలకడగా తన లక్ష్యం వైపు దూసుకుపోతోంది. ఇక కేవలం గ్లామర్ హీరోయిన్ కాకుండా, బాధ్యతగల నటిగా గుర్తింపు తెచ్చుకోవాలన్న ఆమె తపన మెచ్చుకోదగ్గది. భవిష్యత్తులో శ్రీలీల మరిన్ని వైవిధ్యమైన కథలతో గ్లోబల్ స్టేజ్ మీద తన జెండా ఎగురవేయాలని ఆశిద్దాం..

EDITOR, Printed, Published and Owned by KOTLAPALLI FOUZIYAPrinted at Mis FOUZIYAPUBLICATIONS,H.NO:5-1-2/14-1,SREEKANTAPURAM,HINDUPUR,SRI SATYA SAI,ANANTHAUR,ANDHPRADESH-515201.Cell7668886666Printing Press: FOUZIYAPUBLICATIONS,H.NO:5-1-2/14-1,LAKSHMIPURAM,HINDUPUR,SRI SATYASAI,ANAN THAUR, ANDHPRADESH- 515201.RNI Regd No APTEL/26/A0016